జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 13 పక్షపత్రిక జులై 1-15, 2016






## లోక్‌సత్తా ఆరోగ్య విధానంతో తక్కువ ఖర్చుతోనే అందరికీ ఆరోగ్యం +1 కోటి ఉద్యోగాలు




## లోక్‌సత్తా 2.0 - జిల్లాల్లో జోరుగా మలిదశ ఉద్యమ సదస్సులు

# ఉద్రేకాలు వీడి ఆరోగ్యకరమైన చర్చ చేయండి: జేపి






సమాజం బాగుండాలంటే ఆరోగ్యకరమైన చర్చ అవసరమని, అయితే తరతరాలుగా వస్తున్న అజ్ఞానం, మూర్ఖత్వం కారణంగా అలాంటి చర్చకు తావు లేకుండా పోయిందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఇది జాతికి ప్రమాదహేతువు అని హెచ్చరించారు. మానవ వికాస వేదిక హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ హ్యూమనిస్టు డేలో జేపీ మాట్లాడారు. 99శాతం మంది ఉద్రేకపూరిత స్వభావంతో నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ఇటీవల దొంగ బాబా ఘటన అందరికీ గుణపాఠం కావాలన్నారు. మూర్ఖంగా ప్రతి ఒక్కరినీ నమ్మితే ప్రాణాలకు ముప్పే కాకుండా సర్వస్వం కోల్పోతామన్న విషయాన్ని గుర్తించాలన్నారు.

ఆర్బీఐ గవర్నర్ రఘురాం రాజన్ అనుసరిస్తున్న విధానాలు నచ్చలేదని వాదించటంలో తప్పులేదని, అయితే ఆయన దేశభక్తిని శంకించి వ్యాఖ్యలు చేయటం మూర్ఖత్వమని జేపీ అన్నారు. ప్రజాస్వామ్యం అనేది కేవలం ఓటుకు సంబంధించినది కాదని, ఆరోగ్యకరమైన చర్చకు సంబంధించినదని అన్నారు. యువతరం ఆవేశంగా ఆలోచించకుండా సామరస్యంగా ఆలోచించి అందమైన భవిష్యత్తును సాధించుకోవాలని జేపీ పిలుపునిచ్చారు. సమావేశంలో డా॥ మిత్రా, సివిల్ జడ్జీ రాధారాణి, వేదిక అధ్యక్షుడు సాంబశివరావు, మానస, సమన్వయకర్త భానుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



జన రాజకీయం కోసం...
లోక్‌సత్తా టైమ్స్
పక్షపత్రిక జులై 1-15, 2016
సంపుటి - 7 సంచిక - 13

## లోపలి పేజీల్లో...

అనారోగ్య భారత్‌పై స్పందించటానికి ........... 5
ప్రజారోగ్యాన్ని తీవ్రమైన అంశంగా గుర్తిస్తేనే...... 7
పిల్లలకు ఎదిగే అవకాశాలను అందించటం..... 9
సర్కారీ వైద్యానికి సరైన చికిత్స..................... 10
సొంత డబ్బాలూ - శోక రసాలూ.................. 13
అప్పులపై ఆంధ్రప్రదేశ్ మేల్కోవాలి................ 14
తెలంగాణకూ అప్పుల ముప్పు..................... 16
ప్రత్యేక పోరాటం చేయాలి.......................... 18
ఏ వెలుగులకీ ఉచితం.............................. 20
ఉచిత కలర్ టీవీలు హామీ మూకుమ్మడి ......... 22
టీవీల్లాంటి ఎరలు వేస్తున్న పార్టీలపై తక్షణం..... 24
ఫెడరల్ శక్తుల అసలైన యుద్ధం!.................. 26
ఎవరో ఒకరు ఈ మాటలు చెప్పాలి.............. 28
జేపీ నిర్ణయం సరైనది, అనుసరిస్తాం.............. 30
వ్యవసాయ సంక్షోభం @ టమాటాలు........... 31
లోక్‌సత్తా 2.0 ఉధృతంగా మలిదశ ఉద్యమ..... 32
రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక...... 34

సంపాదక వర్గం
డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం
బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# 'ఒకేసారి ఎన్నికలు' మాత్రమే అయితే సంస్కరణ అనిపించుకోదు



లోక్‌సభ, రాష్ట్రాల్లోని శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదనకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ లిఖితపూర్వక మద్దతును తెలియజేసింది. న్యాయమంత్రిత్వ శాఖకు తన అభిప్రాయాన్ని తెలియచేస్తూ ఎన్నికల సంఘం కూడా మద్దతు పలికింది. ఎన్నో ఏళ్ల నుంచి వినిపిస్తున్న ఈ ప్రతిపాదనకు ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో కదలిక వచ్చింది. దీని మీద అన్ని పార్టీలతో చర్చించాకే నిర్ణయానికి రావాలంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా సరైనరీతిలో స్పందించారు. అన్ని పార్టీలూ లోతుగా ఈ అంశాన్ని పరిశీలించి దీర్ఘకాలిక దృష్టితో దేశ ప్రయోజనాలకనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలనేది అర్థవంతమైన ప్రతిపాదన. అయితే ఇదొక్కటే అమలుచేస్తే సంస్కరణ అవదు. ఎన్నికల వ్యయం తగ్గటం, ప్రచార రాజకీయం వల్ల పాలన స్తంభించకపోవటం వంటి ఉపయోగాలు కొంతమేర ఉంటాయిగానీ, ఒకేసారి ఎన్నికైన ప్రభుత్వాలు ఐదేళ్లలోపు ఎదుర్కొనే ఒడిదుడుకులు కొత్త సమస్యలను సృష్టిస్తాయి. కాబట్టి ఒకేసారి ఎన్నికలు జరపటానికి 1) రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకోవటం 2) జాతీయ స్థాయిలో ప్రభుత్వాన్ని కూలదోయాలంటే ప్రత్యామ్నాయం ఉండేలా నిర్మాణాత్మక అవిశ్వాసాన్ని మాత్రమే అనుమతించటం అనే ఏర్పాట్లను జోడించాలి. మధ్యంతర ఎన్నికలకు అవకాశాలుండే రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకోవటం వల్ల సమస్య పరిష్కారమవుతుంది. ఐదేళ్లకోసారి ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. కేంద్రంలో ఇలాంటి ఎన్నిక భారత్ వంటి సంక్లిష్ట వైవిధ్య దేశంలో సాధ్యం కాదు కాబట్టి లోక్‌సభకు ఎన్నికల నిర్వహణకు ఇప్పుడున్న పద్ధతినే కొనసాగిస్తూ, ప్రభుత్వాన్ని పడగొట్టాలంటే 'నిర్మాణాత్మక అవిశ్వాస తీర్మానాన్ని' మాత్రమే అనుమతించాలి. ఒకేసారి ఎన్నికలు+ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక+కేంద్రంలో నిర్మాణాత్మక అవిశ్వాసం .. ఇలా ఈ మూడూ కలిస్తేనే నిజమైన సంస్కరణ సాధ్యమవుతుంది. పార్టీలు డబ్బు ప్రభావం నుంచి బైటపడగలుగుతాయి, ప్రభుత్వాలలో నిజాయతీ, పాలనలో నాణ్యత పెరిగి అంతిమంగా ప్రజలు లాభపడతారు. కోట్ల రూపాయల క్లబ్‌గా మారిన రాజ్యసభలో కూడా ఒకేసారి ఎన్నికలకు తగ్గట్టు సభ్యులను ఎన్నుకునే ఏర్పాటు చేస్తే రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయానికి నిజమైన ప్రాతినిధ్యం వహించగలుగుతుంది. పరిష్కారంలో భాగమయ్యేందుకు పార్టీలు, పౌర సమాజం, మీడియా ఈ ప్రతిపాదనలకు మద్దతు తెలుపుతాయని లోక్‌సత్తా ఆశిస్తోంది.



# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు


| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# అనారోగ్య భారత్‌పై స్పందించటానికి ఇంకెంత సంక్షోభం కావాలి?

## లోక్‌సత్తా ఆరోగ్య విధానంతో తక్కువ ఖర్చుతోనే అందరికీ ఆరోగ్యం + 1కోటి ఉద్యోగాలు

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**




అమెరికాలో 32 కోట్ల మంది జనాభా ఉంటే ఆరోగ్య సంరక్షణ రంగంలో 1.2కోట్ల మంది ఉద్యోగులున్నారు. బ్రిటన్‌లో 6.4 కోట్ల మంది ప్రజలుంటే, ఆరోగ్య సిబ్బంది 16లక్షలున్నారు. అదే మనదేశంలో 130 కోట్ల మంది జనాభా ఉంటే కేవలం 36 లక్షలమంది ఆరోగ్యరంగ ఉద్యోగులు ఉన్నారు. సరైన ఆరోగ్య విధానాన్ని అవలంబిస్తే మనదేశంలో మరో 1కోటి ఉద్యోగాలు ఆరోగ్య రంగంలో వస్తాయి.

మార్కెట్ ఆర్థిక వ్యవస్థ అందరికీ లాభదాయకమని నేను విశ్వసిస్తాను. కానీ ప్రభుత్వాలు మౌలికమైన బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చినప్పుడే సమన్యాయం జరిగి మార్కెట్ల ద్వారా సరైన ఫలితాలు వస్తాయి. మనం పోలీసు వ్యవస్థను, కోర్టుల్ని ప్రయివేటీకరించగలమా? ఇలాంటి మౌలిక రంగాల్లో కూడా మాకు బాధ్యత లేదు అంటే ఇక ప్రభుత్వం ఎందుకు?

జికా వైరస్ వల్ల వచ్చిన మైక్రోసెఫలీ కేసులు 1500 దాకా ఉంటాయి. ఒలింపిక్స్ వేదిక చుట్టూ జికా వైరస్ ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదే మనదేశంలో చూడండి. ర్యుబెల్లా వ్యాధి భారత్‌లో ఏటా 1,00,000 మందికి పైగా పిల్లలు పుట్టుకతో లోపాలతో జన్మిస్తున్నా నేరసమాన మౌనం. లోక్‌సత్తా చేసిన నిరంతర కృషితో ర్యుబెల్లా వ్యాక్సిన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగమైంది. కానీ ఇప్పటికీ మనదేశంలో 30-50శాతం మంది పిల్లలకు టీకాలు అందటం లేదు. ఏటా ఐదేళ్లలోపు చిన్నారులు 12లక్షల మంది నివారించదగ్గ అనారోగ్యం బారినపడి చనిపోతున్నారు. పెద్ద, చిన్న తేడాలేకుండా మనదేశంలో 30శాతం మరణాలకు నివారించదగ్గ ఇన్ఫెక్షన్లే కారణం. మనం ప్రజారోగ్య రక్షణను ఇంకెప్పుడు సీరియస్‌గా తీసుకుంటాం?

సంపన్న దేశాలు తమ జాతీయ ఆదాయంలో 7-9శాతం ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఖర్చుచేస్తున్నాయి. మనం చేస్తున్నది మాత్రం కేవలం 1.2శాతం. ఈ రంగంలో 70శాతం ప్రయివేటు ఖర్చుగా ఉంది. అది కూడా ప్రజలు తమ జేబులో నుంచి భారీగా ఖర్చు చేస్తున్న డబ్బు. కేవలం అనారోగ్యం వల్ల ఏటా 4-5కోట్ల మంది పేదలుగా మారిపోతున్నారు.

కానీ ప్రభుత్వం కేవలం 2శాతం ఖర్చు పెడితే వైద్య, ఆరోగ్య రంగాన్ని గణనీయంగా మెరుగుపరుచుకునే అవకాశాలుండటం భారత్‌కు గొప్ప సానుకూల అవకాశం. కానీ ఈ డబ్బుని మనం చాలా జాగ్రత్తగా, విజ్ఞతతో వినియోగించాలి. ముఖ్యంగా కుటుంబ ఆరోగ్యాన్ని అందించటంలో పోటీని పెంచి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ఖర్చు చేయాలి.

ప్రజారోగ్యంలో ప్రభుత్వ వ్యయాన్ని మూడేళ్లలో 1.2శాతం నుంచి 2శాతానికి పెంచటం పూర్తిగా ఆచరణసాధ్యం. పేదరికాన్ని నిర్మూలించటానికి నిస్సందేహంగా ఇది అత్యుత్తమ పరిష్కారం అవుతుంది. దీనివల్ల 1 కోటి ఉద్యోగాలు కూడా వస్తాయి, ఓట్లు కూడా పడతాయి.



**Rajdeep Sardesai Verified account @ sardesairajdeep**

*Well spent day with some wise netas and officials discussing public health and the media* **@prithvrj, @JP_LOKSATTA**






**Jayaprakash Narayan Verified account @ JP_LOKSATTA**

Jayaprakash Narayan Retweeted Rajdeep Sardesai

Rajdeep anchored discussions on mainstreaming public health.Hopefully this will grow&influene discourse & politics.

మెరుగైన జీవితం కోసం, పేదరికాన్ని నిర్మూలించటం కోసమే అభివృద్ధి. మంచి ఆరోగ్యం, విద్య అభివృద్ధిని, ఉద్యోగాలను అందిస్తాయి. అందుకే ఇవి ఆధునికతకు కేంద్రబిందువు. వీటిని నిర్లక్ష్యం చేయటమంటే పేదరికాన్ని, వివక్షను కొనసాగించాలను కోవటమే.

ప్రభుత్వం కూడా ఆధునిక ప్రజాస్వామ్యానికి తగ్గట్టు తన పాత్రను మార్చుకోవాలి. చట్టబద్ధపాలన, మౌలిక వసతులకు తోడు నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అందించాలి. ఈ కీలకరంగాలలో విఫలమైతే ప్రభుత్వం ఎందుకు?

మనం ఎల్లకాలం గాలివాటంగా నిద్రలో నటిస్తున్నట్టుగా వ్యవహరించలేం. గొప్ప దేశాలు, పెద్ద ఆర్థిక వ్యవస్థలకు కొన్ని ప్రమాణాలుంటాయి. నిజమైన అభివృద్ధిని సుస్థిరంగా సాధించేందుకు మనల్ని మనం కూడా అలా మలచుకోవాలి.

శక్తిసామర్థ్యాలు వికసించే అవకాశాలు లేకపోవటం (విద్యలో వైఫల్యం), నివారించదగ్గ వేదన (ఆరోగ్యంలో వైఫల్యం).. ఇవి రెండు ఆధునిక సమాజం చేస్తున్న అత్యంత ఘోరపాపాలు. మనదేశంలో ఈ మానవ ఘోరాలు చుట్టూ కోకొల్లలుగా కనిపిస్తాయి.

ఇతర దేశాలు మనకంటే అధ్వాన్న పరిస్థితుల నుంచి ఎదిగాయి. మనకు అనేక బలాలున్నాయి. విద్య, ఆరోగ్యాలకు డిమాండ్ పుష్కలంగా ఉంది. అవసరమైన పునాదులు ఉన్నాయి. కావలసిందల్లా సంకల్పం. మనకు సరైన సంకల్పం ఉంటే ఖచ్చితంగా వీటిని సాధించగలం.


మోదీ ప్రభుత్వం పటిష్టంగా ఉంది. ప్రజలు మార్పునకు సిద్ధంగా ఉన్నారు. ఆరోగ్యం అందించటానికి ఏ పార్టీకీ అభ్యంతరం అక్కర్లేదు. అందరూ కలిసివస్తారు. తక్కువ వ్యయంతో పరిష్కారం సాధ్యం. మూడు నాలుగేళ్లలో 1శాతం జాతీయాదాయం అంటే పెద్ద విషయం కాదు. కాబట్టి అందరికీ ఆరోగ్యం సంస్కరణకు ఇది తగిన సమయం.

మౌలిక వసతుల రంగంలో పరిస్థితులు మెరుగవుతున్నాయి. కానీ ఇంకా చాలా చేయాల్సుంది. సరైన మార్గంతో సరైన దిశలో వెళ్లాల్సుంది. అందరికీ నాణ్యమైన ఆరోగ్యం, విద్య అందించటం తక్షణ ప్రాథమ్యం.

# ప్రజారోగ్యాన్ని తీవ్రమైన అంశంగా గుర్తిస్తేనే భారత్ కోలుకోగలుగుతుంది



**భా**రతదేశంలోని వరుస ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ బాధ్యతలు అనే విషయాన్ని జనం కూడా మర్చిపోయి, తమ నిస్సహాయ స్థితికి, అనారోగ్యానికి తమ తలరాతను నిందించుకుంటున్నారు. ఈదేశంలోని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ఎజెండాలో విద్య, ఆరోగ్యం గురించి చర్చించిన దాఖలాలు (లోక్‌సత్తా మినహాయించి) లేవు. ఫలితంగా, ఎన్నో సంవత్సరాలుగా సర్కారీ ఆరోగ్య వ్యవస్థ విఫలమై చతికిలపడింది. ఇప్పుడు ప్రయివేటు ఆసుపత్రులపై ఆధారపడి, ఆ ఖర్చుల భారంతో పేదరికంలో కూరుకుపోయే దుస్థితిని ప్రజలకు కల్పించింది.





మనదేశ ఆరోగ్య వ్యయం నేడు రూ.4లక్షల కోట్లు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఖర్చు చేస్తున్నది కేవలం రూ.1 లక్షా 25వేల కోట్లు. అంటే, మొత్తం వ్యయంలో కేవలం 30శాతం ప్రభుత్వ ఖజానా నుంచి కేటాయింపు అవుతోంది. జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, ఇటలీ వంటి దేశాల్లో మొత్తం ఆరోగ్య వ్యయంలో 76 నుంచి 82 శాతాన్ని ప్రభుత్వాలే భరిస్తాయి. భారత్ ఏటా ఒక పౌరునికి 44 డాలర్లు మాత్రమే ఖర్చు చేస్తుండగా, మన పొరుగున ఉన్న శ్రీలంక దానికి రెండు రెట్లు, చైనా ఆరు రెట్లు ఖర్చు చేస్తున్నాయి. అందువల్ల ఆరోగ్య తలసరి వ్యయం పరంగా 190 దేశాలలో మనదేశం అడుగున 157వ స్థానంలో ఉంది. ఈ తక్కువ వ్యయం ఒక పక్షవాతపు ఆరోగ్య వ్యవస్థకు దారితీస్తుంది.


ప్రస్తుతం భారతదేశంలో వైద్యసదుపాయాల కొరత చాలా ఉంది. ఆరోగ్య ఉపకేంద్రాలు 35,145 (20శాతం), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 6,556 (22శాతం), సామాజిక ఆరోగ్య కేంద్రాలు 2,136 (32శాతం) మేర తక్కువగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు సామాజిక ఆరోగ్య కేంద్రాలు కూడా వైద్య నిపుణులు లేని కారణంగా స్తంభించిపోయిన స్థితిలో ఉన్నాయి. ఆరోగ్య సౌకర్యాలపై అసంతృప్తితో గ్రామీణ ప్రజలు మెరుగైన వైద్య సేవల మీద ఆశతో పట్టణాల వైపు పరుగులు తీయడం వలన తృతీయ దశ వైద్యాన్ని అందించే బోధనా వైద్యశాలల్లో రద్దీ పెరిగి అరకొర, అసంతృప్తికర వైద్యసేవలకు దారితీస్తున్నది. దీనివల్ల ప్రజలు చికిత్స చేయించుకోవటానికి బస్టాపుల్లో, ఫుట్‌పాత్‌ల మీద నిద్రిస్తూ వేచి ఉండాల్సి వస్తోంది. సుమారు 65శాతం మంది ప్రజలు తాము అనారోగ్యం పాలైనప్పుడు ప్రభుత్వ ఆరోగ్య సౌకర్యాలన వినియోగించుకోవడం లేదని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వెల్లడించింది. దీనికి ప్రధాన కారణాలు- నాణ్యత లోపించిన వైద్య సేవలు (57శాతం), దగ్గర్లో వైద్య సదుపాయాలు లేకపోవటం (48శాతం), చాలా సమయం వేచి ఉండాల్సి ఉ ఒడటం (24శాతం).

ఇక ఈ ప్రజల కోసం మిగిలిన ఒకే ఒక ఆశ ప్రయివేటు ఆసుపత్రులు. ప్రయివేటు/కార్పొరేట్ ఆసుపత్రుల్లో నాణ్యమైన సేవలు లభ్యమవుతాయిగానీ అవి ఎక్కువ ఖర్చుతో కూడుకున్నవి. ఎక్కువగా ప్రయివేటు ఆసుపత్రుల మీద ఆధారపడటం, రోగికి-వైద్యునికి మధ్య సమాచారం సరైనరీతిలో లేకపోవటం వంటి కారణాలు అనవసర చికిత్సకు దారితీస్తూ గత దశాబ్దంలో ఒక్కసారిగా ఖర్చులు భారీగా పెరగటానికి కారణమయ్యాయి. 2014లో రోగి సంరక్షణ సంబంధిత వార్షిక వృద్ధి రేటులో ప్రభుత్వ వ్యయం (5.8శాతం) కంటే ప్రయివేటు వ్యయమే (11.4శాతం) ఎక్కువగా ఉన్నట్టు నిర్ధారించారు.

ఖర్చులు పెరగడం వల్ల ఆరోగ్య సంరక్షణలో ప్రభుత్వేతర వ్యయం కూడా పెరుగుతోంది. ప్రస్తుతం భారతదేశంలోని ప్రభుత్వేతర ఖర్చు రూ.2లక్షల 75వేల కోట్లు ఉండగా, అందులో సుమారు 86శాతం ప్రజలు తమ జేబుల్లో నుంచి ఖర్చు

చేస్తున్నారు. అనగా ఆరోగ్య వ్యయం ప్రజల పొదుపు మొత్తాలకు చిల్లుపెడుతోంది. భారత్‌లో ఆసుపత్రి పాలైన ప్రజలు తమ మొత్తం వార్షిక వ్యయంలో 48శాతం ఆరోగ్యం కోసమే ఖర్చు చేస్తారని ఎన్ఎస్ఎస్‌వో సర్వే వెల్లడించింది. జర్మనీ, ఫ్రాన్స్, యూకే వంటి దేశాలలో మొత్తం ప్రభుత్వేతర ఆరోగ్య వ్యయంలో 32 నుంచి 55శాతం ప్రజలు ఖర్చు చేస్తారు. ఆ దేశాలలోని ఉత్తమ బీమా నిధులు ప్రజల వ్యయాన్ని తగ్గిస్తాయి.




దురదృష్టవశాత్తూ, భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ వ్యయ భారం సాపేక్షంగా పేద ప్రజలపైన ఎక్కువగా ఉంది. సరైన పారిశుద్ధ్య సౌకర్యాలు లేకపోవడం, అనారోగ్యకరమైన పరిస్థితులు, పోషకాహార లోపం మొదలైనవి పేదలు అధికంగా ఆసుపత్రి పాలవ్వడానికి కారకాలుగా ఉన్నాయి. ఆసుపత్రిలో అధిక వ్యయంతోపాటు అదనంగా ఔషధాల అధిక ధరలు పేదలపై భారంగా ఉంటూ ఆరిని అధిక వడ్డీలకు రుణాలు తీసుకునేలా నిస్సహాయంగా మారుస్తున్నాయి. ప్రస్తుతం, 33శాతం మంది భారతీయులు డబ్బు రుణంగా తీసుకోవడం ద్వారా లేదా తమ వస్తువులను అమ్మడం ద్వారా ఆసుపత్రి బిల్లుల్ని కడుతున్నారు. ఈ అధిక వ్యయాల వల్ల ఎంతోమంది పేదరికం కోరల్లో చిక్కుకుంటున్నారు.

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారిలో 50శాతం కుటుంబాల పేదరికానికి కారణం- అనార్యోగం, అధిక ఆరోగ్య వ్యయమే.

ఇప్పటి వరకూ ప్రభుత్వాలు కొద్దిపాటి ప్రయత్నాలతో ఓట్లకు సంబంధించిన విషయం కాదు కదా అన్నట్లు బండి నడిపిస్తున్నారు. జాతీయ ముసాయిదా ఆరోగ్య విధానం మాత్రం రాబోయే సంవత్సరాలలో స్థూల జాతీయోత్పత్తిలో 2.5 శాతానికి (1.3శాతం) ఆరోగ్య కేటాయింపుల్ని పెంచాలని ఆశిస్తున్నది. కానీ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఇది కావలసిన దానికంటే చాలా తక్కువే. అయితే, కేవలం అధిక ప్రభుత్వ వ్యయాల ద్వారానే అధిక ఆరోగ్య ఫలితాలను ఆశించలేం. దీనికి అమెరికా ఆరోగ్య నమూనాయే ఒక ఉదాహరణ. అమెరికా మొత్తం ఆరోగ్య వ్యయం దాని స్థూల జాతీయోత్పత్తిలో 18శాతం. ప్రపంచంలో అత్యధిక ఆరోగ్య వ్యయం చేసే దేశాలలో అమెరికా ఒకటి. అయినప్పటికీ ఆరోగ్యకరమైన ఆయుర్దాయంపరంగా 300 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ స్థూల జాతీయోత్పత్తి కలిగిన 54దేశాలలో అమెరికా ఇప్పటికీ మధ్యస్థంగా 24వ స్థానంలో ఉంది.

ప్రజలు, రాజకీయాలు కలిసి ఒకే తాటిలో నడిచి ఆరోగ్యాన్ని లక్ష్యంగా చేసుకున్నప్పుడే ఒక బలమైన ఆరోగ్య సంరక్షణ విధానం సాధ్యమవుతుంది.


భారతదేశంలో ప్రభుత్వ వ్యయంగానీ, ప్రభుత్వ బీమా పథకాలుగానీ పెద్ద సవాళ్లను ఎదుర్కోలేవు. తక్షణావసరంగా అందరికీ 5 నుంచి 10 కిలోమీటర్ల ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా మన ప్రస్తుత ఆరోగ్య విధానాన్ని పునర్నిర్మించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్య సంరక్షణని తీవ్రంగా పరిగణలోకి తీసుకుంటే తప్ప, భారతదేశం ఈ జబ్బుపడిన విధానం నుంచి బైటపడలేదు. ఈ హేతుబద్ధ, సాక్ష్యాధారాలతో కూడిన వివరాలతోనే లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానాన్ని రూపొందించి కేంద్రప్రభుత్వానికి అందచేసింది. అల్పమైన విభేదాలను అధిగమించి.. దేశ ప్రజలను ఆరోగ్యవంతులుగా, సంపన్నులుగా మార్చడం కోసం ఈ సంస్కరణల్ని అమలుచేయాల్సిన అవసరం ఉంది.

వచ్చిన ఆరోగ్య నిధుల్ని కూడా వినియోగించటం లేదు

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల్ని కూడా గత రెండేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయటం లేదు. ఆరోగ్య కేంద్రాలు, సిబ్బంది నిర్వహణకు ఈ పథకం కింద కేంద్రం 60శాతం నిధులను సమకూరుస్తుంది. గత ఏడాది కేంద్రం నుంచి విడుదలైన రూ.458 కోట్లు తెలంగాణ సర్కారు వద్ద ఇంకా అలానే ఉన్నాయి. ■

# పిల్లలకు ఎదిగే అవకాశాలను అందించటంలో ఆఫ్రికా దేశాలకన్నా వెనకబడ్డ భారత్

పిల్లల ఎదుగుదలకు కీలకమైన పౌష్టికాహారాన్ని అందించటంలో భారత్.. వెనకబడిన ఆఫ్రికా దేశాలకన్నా వెనకబడి ఉందని తాజా అధ్యయనాలు వెల్లడించాయి. మనదేశంలో 38.7శాతం మంది పిల్లలు పెరుగుదల లోపంతో బాధపడుతున్నారు. 132 దేశాలలో సర్వే నిర్వహించగా, భారత్ ర్యాంకు 114గా ఉందని ప్రపంచ పోషకాహార నివేదిక (జీఎన్ఆర్) తెలిపింది. ప్రస్తుతం చైనా ర్యాంకు 26, ఘనా, టోగో ర్యాంకులు 52, 80గా ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితే కొనసాగితే ఘనా, టోగోలను చేరుకోవడానికి 15 ఏళ్లు, చైనాను అందుకోవడానికి 40 ఏళ్లు పడుతుందని తెలిపింది. పోషకాహార లోపంపై యుద్ధంలో అనేక దేశాలతో పాటు భారత్ పురోగమిస్తున్నప్పటికీ, ఆ ప్రయత్నం అరకొరగానే ఉందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఎదుగుదల లోపించిన పిల్లల్లో మూడోవంతు భారత్‌లోనే ఉన్నారని వివరించింది.




**వైద్య సేవలు అందించటంలోనూ భారత్ అధ్వాన్నం, ప్రజలపై పెను ఆర్థిక భారం**

ప్రజారోగ్యాన్ని అందించటంలో భారత్ వైఫల్యాన్ని కూడా నివేదిక వెల్లడించింది. గుండె జబ్బులకు సంబంధించి వైద్యానికి భారత ప్రజలు తమ ఆదాయంలో 30శాతం ఖర్చు చేస్తున్నారని, 1995–2004 మధ్య హృద్రోగ సంబంధిత వైద్య ఖర్చు దాదాపు 58శాతం పెరిగిందని తెలిపింది.

భారతీయుల్లో వందకు పదిమంది చక్కెర వ్యాధితో బాధపడుతున్నారని, డయాబెటిస్‌పై జరిపిన అధ్యయనంలో 190దేశాలలో భారత్ 104వ స్థానంలో ఉందని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్న ఊబకాయం సమస్య భారత్‌లో కూడా పెరుగుతోందని తెలిపింది. ■


# ఐరోపా దేశాల్లో 90శాతం ప్రభుత్వ వైద్యమే

సరైన వైద్యమందక తొలి పుట్టినరోజు జరుపుకోకుండానే దేశంలో ఏటా 10లక్షలమంది మరణిస్తున్నారని ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు, పూర్వపు ఛైర్మన్ డాక్టర్ వల్లభనేని రాంప్రసాద్ అన్నారు. వీరిలో పేదల బిడ్డలే ఎక్కువని చెప్పారు. నెల్లూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ, యూరోపియన్ దేశాల్లో 90శాతం వైద్యం ప్రభుత్వం చేతుల్లోనే ఉందని చెప్పారు. మనదేశంలో మాత్రం దీనికి విరుద్ధంగా జరుగుతోందన్నారు.

బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు అన్ని శాఖల సలహాలను స్వీకరిస్తున్న ప్రభుత్వం.. ఒక్క వైద్యశాఖను మాత్రం దూరంగా పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య శాఖ, డాక్టర్ల పర్యవేక్షణలో ప్రభుత్వం మందుల ధరల్ని నిర్ణయించాల్సి ఉందని చెప్పారు. కానీ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో కలిసి ప్రభుత్వం చాలా మందుల ధరల్ని నిర్ణయిస్తోందన్నారు. సమావేశంలో జిల్లా ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎంఏవీవీ ప్రసాద్, డాక్టర్ భక్తవత్సలం, డాక్టర్ అశోక్, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు. ■

# 'సర్కారీ వైద్యానికి' సరైన చికిత్స

-డా॥ జయప్రకాష్ నారాయణ్




మన సమాజం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యల్లో వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం ప్రధానమైనది. ఒక వ్యక్తి పుట్టుక, కులం, హోదా, ఆస్తిపాస్తులు.. ఇందులో దేనితోనూ సంబంధం లేకుండా సహేతుకమైన, సరైన ప్రమాణాలుగల వైద్య సదుపాయాలు అందరికీ అందాలి. ఈ రకంగా చూసినప్పుడు.. ఆరోగ్య సంరక్షణ విషయంలో అత్యంత వెనుకబడిన దేశాలలో ఇండియా ఒకటి. మరో వంక, మనదేశంలో ఆరోగ్యరంగానికి సంబంధించిన మౌలిక వ్యవస్థ, వైద్య సంస్థలు ఉన్నాయన్నదీ గమనార్హం. మనదేశంలో 3100కు పైగా సామాజిక ఆరోగ్య కేంద్రాలు ప్రభుత్వరంగంలో నెలకొన్నాయి. ఒక్కో ఆరోగ్య కేంద్రంలో 30 నుంచి 50 పడకలు, ముగ్గురి నుంచి అయిదుగురి వరకు వైద్యులు, వారికి తోడుగా ఇతర సిబ్బంది ఉన్నారు. దేశం మొత్తం మీద రమారమి 23,000 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిలో ప్రతిచోట ఇద్దరు ముగ్గురు వైద్యులు, నాలుగు నుంచి ఆరు పడకలు, 14మంది పారా మెడికల్ సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు జరిగాయి. ప్రతి ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనూ సాధారణంగా ఆరు ఉప కేంద్రాలున్నాయి. వారికి తోడుగా, అర్హులైన ఇద్దరు మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లు (ఒకరు ఆడ, మరొకరు మగ) ఉంటారు. భారతదేశంలో 1,37,000 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలున్నట్టు అంచనా.

**ముందుజాగ్రత్త లేకే ప్రమాదం**

ప్రైవేటు, ప్రభుత్వ రంగాలలో మొత్తంగా తొమ్మిది లక్షల పడకలున్నాయని, అయిదు లక్షల వైద్యులున్నారని అంచనా. నర్సుల సంఖ్య 7.5లక్షలు. ఆసుపత్రుల సంఖ్యా ఎక్కువగానే ఉంది. ఈ సంఖ్య నానాటికీ పెరుగుతుండటంతో పాటు వైద్య సదుపాయాల్లోనూ మెరుగుదల నమోదవుతోంది. రోగ నిర్ధారణ పరీక్షలకు, రోగ నిరోధానికి, శస్త్ర చికిత్సలకు అభివృద్ధి చెందిన దేశాల్లో చాలా ఎక్కువ మొత్తం ఖర్చవుతుంది. అక్కడితో పోలిస్తే మనదేశంలో ఆయా సేవల కోసం ఖర్చయ్యేది స్వల్పం. మనదేశంలో ఔషధాల తయారీ పరిశ్రమ అధునాతనమైనది. ఆరోగ్య సంరక్షణ విషయానికి వస్తే.. ప్రజలు అందుకోసం ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. భారతదేశంలో ప్రజలు ఆరోగ్య సంరక్షణకు ఖర్చవుతున్న మొత్తంలో దాదాపు 83శాతాన్ని సొంతంగానే భరిస్తున్నారు. మనదేశంలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఈ రకంగా బలం పుంజుకున్నట్టు కనిపిస్తున్నా.. ఓ సగటు మనిషి అనారోగ్యం పాలైతే పరిస్థితి ఏమిటంటే వినిపించేవి కఠోర వాస్తవాలే.

ఈ దేశంలో పేదల్లో అత్యధిక భాగం, మధ్యతరగతి వర్గంలో ఎక్కువమంది ఆరోగ్యబీమా ఛత్రఛాయల్లో లేరు. ఎలాంటి అనారోగ్యానికి గురైనా.. వైద్యుడు పరిశీలించాలి. పరీక్షలు చేయించుకోవాలి, వైద్యం చేయించుకోవాలి. కొన్ని సందర్భాలలో ఆసుపత్రిలో చేరాల్సి ఉంటుంది. ఇంకొన్ని సందర్భాలలో శస్త్రచికిత్స కూడా అవసరమవుతుంది. అంటే ఆరోగ్య సంరక్షణ అనేది డబ్బుతో ముడిపడిన వ్యవహారం.

వైద్యరంగం అత్యద్భుతమైన ప్రగతి సాధించింది. అయితే, ఎంత అత్యాధునిక వైద్య విధానమైతే.. అంత ఖరీదు ఎక్కువగా ఉండటమూ మామూలు విషయమే అయింది. ఇలాంటి సమస్యలు అనేకం ఉన్నాయి కాబట్టే జబ్బు పడుతున్నామనే భావనే సగటు మనుషుల్ని కుంగదీస్తోంది. ఒక్కోసారి జబ్బుపడితే– సగటు మనిషి తన సాంవత్సరిక ఆదాయంలో 60శాతాన్ని వైద్యానికే వెచ్చించాల్సి వస్తోందని అంచనా. వైద్యం అంత ఖరీదు అయిపోబట్టే ఆసుపత్రుల్లో చేరినవారిలో 40శాతం తమకున్న కొద్దిపాటి ఆస్తుల్ని అమ్ముకునో, ఎవరి దగ్గరన్నా వడ్డీకి డబ్బు తీసుకొనో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆసుపత్రులపాలైన వారిలో 25శాతం మంది అలా ఖర్చు పెట్టిన తరువాత నిరుపేదలుగా మారుతున్నారు. ఇలా ఓ మనిషి జబ్బుపడటమన్నది అతడు/ఆమె మీద, అతడి కుటుంబం మీద తీవ్ర దుష్ప్రభావం చూపుతోంది. వారి ఆర్థిక పతనానికి అదే కారణమవుతోంది. సమాజంలోని నిరుపేదలు, వ్యవస్థీకృత రంగంలో లేని వ్యవసాయ కార్మికులు, చిన్నకారు, సన్నకారు రైతులు, ఇంటిపని చేసేవారు, దినసరి వేతన కార్మికులు, బరువులు మోసే శ్రామికులు, డ్రైవర్లు.. ఇలాంటి స్వల్పాదాయ వర్గాలవారంతా వైద్య చికిత్సలకు అయ్యే ఖర్చును తట్టుకోలేకపోతున్నారు. ఈ ఆధునిక యుగంలోనూ ఇలా సమాజంలోని అత్యధికులు వైద్యం పేరు చెబితేనే బెంబేలెత్తే పరిస్థితి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు.

ఇక్కడో ముఖ్యాంశాన్ని అందరూ గుర్తించాలి. మనదేశంలో మనుషుల్ని ఆసుపత్రి పాల్జేస్తున్న జబ్బుల్లో దాదాపు 80శాతం నివారించదగినవే. కొద్దిపాటి ముందుజాగ్రత్త తీసుకొంటేనే అది సాధ్యమవుతుంది. పౌష్టిక ఆహారం, సురక్షితమైన మంచినీరు, వ్యాధి నిరోధక టీకాలు వంటివి వేయించుకోవడం, గర్భధారణలకు ముందు గర్భధారణ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవడం, జననాలకు ముందు, తరువాత శిశువులకు వ్యాధి నిరోధక ఔషధాలను నిర్దిష్ట సమయంలో ఇవ్వడం, వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తించి వైద్యం చేయించుకోవడం.. ఇవన్నీ తక్కువ ఖర్చుతో కూడుకొన్నవి. తక్కువ ఇబ్బందికరమైనవి. ఒకసారంటూ వ్యాధి ముదిరిన తరువాత శస్త్రచికిత్స చేయటం, ఇతరత్రా వైద్యం చేయటం– ఈ రెంటికీ భారీగా సొమ్ము ఖర్చవుతుంది. ఎంత ఖర్చు చేసినా కొన్ని సందర్భాల్లో ప్రయోజనం ఉండకపోనూవచ్చు. నిజానికి మన సమాజంలోని పేదవర్గాలు, దళితులు, ఆదివాసులు, అల్పాదాయవర్గాల మహిళలు, పిల్లలకు ఆరోగ్య సంరక్షణ చేసుకొనే పరిస్థితులు లేకపోవడం వల్లే జబ్బుపడినప్పుడు వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో.. ఆరోగ్య పరిరక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా, ప్రాథమిక ఆరోగ్య సదుపాయాలను సక్రమంగా తీర్చిదిద్దకుండా ప్రజలు ఎలాంటి రోగాలూరొష్టుల బారిన పడకుండా కాపాడటం అసాధ్యం. ఈ అంశాల మీద దృష్టి సారించకుండా వైద్యం కోసం డబ్బు ఖర్చుపెట్టడం వృథా. దీని అర్థం ఆసుపత్రుల అవసరమే లేదని కాదు. మంచి ఆసుపత్రులు ఉండటం ఎంతైనా అవసరం. మనలో అనేకమందికి ఆరోగ్యమన్నది కేవలం ఏదో జబ్బుపడినప్పుడు మాత్రమే గుర్తుకు వస్తుంది. అలా జబ్బు పడినవారు కోలుకొనేందుకు ప్రభుత్వ వైద్యశాలలు ఉపయోగపడకపోతే.. ప్రజలకు ముందు జాగ్రత్తల గురించి,

> **ఒక్కోసారి జబ్బుపడితే- సగటు మనిషి తన సాంవత్సరిక ఆదాయంలో 60శాతాన్ని వైద్యానికే వెచ్చించాల్సి వస్తోందని అంచనా. వైద్యం అంత ఖరీదు అయిపోబట్టే ఆసుపత్రుల్లో చేరినవారిలో 40శాతం తమకున్న కొద్దిపాటి ఆస్తుల్ని అమ్ముకునో, ఎవరి దగ్గరన్నా వడ్డీకి డబ్బు తీసుకొనో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆసుపత్రులపాలైన వారిలో 25శాతం మంది అలా ఖర్చు పెట్టిన తరువాత నిరుపేదలుగా మారుతున్నారు.**

ఆరోగ్య సంరక్షణ గురించి ఉపన్యాసాలిచ్చి ఉపయోగం ఉండదు. నమ్మకంగల వైద్యుడు పరీక్షిస్తున్నప్పుడు, ఆసుపత్రిలో రోగనిర్ధారణ పరికరాలు, వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నప్పుడు, అవసరాన్ని బట్టి ఆసుపత్రిలో చేర్చుకొని మందులు ఇస్తున్నప్పుడు– మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో మంచి అభిప్రాయం కలుగుతుంది.

ఇక్కడే ఇంకో విషయం. ఆరోగ్య సంరక్షణ విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకొన్నా.. కొందరు జబ్బుపడటం సహజం. ఇలా ఎందుకు జరుగుతుందంటే– అన్ని వ్యాధుల్నీ నివారించడం కుదరదు కనుక. అలాంటి జబ్బులు– ముందే చెప్పినట్టు– ఆయా వ్యక్తుల్ని, కుటుంబాలను కోలుకోలేనంతగా దెబ్బతీస్తాయి. జబ్బుపడిన మనిషి శారీరక సామర్థ్యాలూ కుంచించుకుపోతాయిగనుక, ఆర్థికంగానూ నష్టపోతాడు. ఒక్కోసారి వ్యాధిని వెంటనే గుర్తించకపోతే, ఖరీదైన వైద్యం చేయించుకొనక తప్పదు. ఆ పరిస్థితుల్లో కొన్ని సందర్భాల్లో ఆరోగ్యపరంగా జరిగిన నష్టాన్ని భర్తీ చేయలేకపోవచ్చు. ప్రాణాలు దక్కకపోవచ్చు.

మనదేశంలో ప్రభుత్వ వైద్యసేవలు ప్రజావసరాన్ని

తీర్చలేకపోతున్నాయన్నది వాస్తవం. ప్రభుత్వం ఏర్పాటుచేసిన వైద్యకేంద్రాలు చాలా తక్కువ. 106 కోట్ల జనాభాకు 3100 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏమూలకు సరిపోతాయి. సగటున ప్రతి లక్షమందికి 30 నుంచి 50 పడకలుగల ఆసుపత్రి అందుబాటులో ఉండాలి. ఆ రకంగా చూసినప్పుడు మనదేశంలో కనీసం 10,000 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ప్రభుత్వరంగంలో ఏర్పాటుకావాలి. వీటికిపైన జిల్లా స్థాయిలో పెద్ద ఆసుపత్రులు ఏర్పాటుకావాలి. ఆసుపత్రులు, ప్రత్యేక ఆసుపత్రులంటే కేవలం భవనాలు నిర్మించటం కాదు. వాటిలో సరైన సంఖ్యలో డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది ఉండాలి. పరికరాలు, లేబరేటరీలు, ఔషధాలు లేకపోతే రోగులకు సరైన చికిత్స అందడం అసాధ్యం. మనదేశంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిస్థితులు దయనీయంగా కనబడటానికి కారణం ఇందుకోసం కేటాయించే సొమ్మూ నామమాత్రంగా ఉండటమే.

ప్రభుత్వ ఆసుపత్రులంటూ పేరుకు కనిపిస్తున్నా వాటిలో పనితీరు అధ్వాన్నంగా ఉంటోంది. వైద్యులు, సిబ్బందిలో జవాబుదారీతనం లేకపోవటం, బాగా ముదిరిన అవినీతి జబ్బు వేధింపులు, సాధింపులు ఎక్కువ కావటం, ఆరోగ్య ప్రమాణాలు ఆందోళన గొలిపేవిగా ఉండటం, పరికరాలను సక్రమంగా నిర్వహించకపోవటం, ఔషధాల కొరత.. ఇలా ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించిన సమస్యల చిట్టా సుదీర్ఘమైనది. కాబట్టే 'సర్కారీ ఆసుపత్రి స్వర్గలోకానికి షార్ట్‌కట్' అనే భావం బలపడుతోంది. ఇందుమూలంగానే పేద వర్గాలవారు కూడా తాహతులేకపోయినా అప్పో సొప్పో చేసి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. పోనీ అక్కడైనా వారికి నిర్దుష్టమైన, సశాస్త్రీయమైన వైద్యం అందుతోందా అంటే అదీ లేదు. ఫలితంగా కోట్ల సంఖ్యలో భారతీయులు పేదరికం, జబ్బుల విషవలయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

**సహకార వైద్యమే శరణ్యం**

మనదేశంలో మంచి ప్రమాణాలను అనుసరించే ప్రభుత్వ ఆసుపత్రులు కావాలి. ఇక్కడి పేదలు జబ్బుపడితే వైద్యం వారికి మోయలేని భారమనే పరిస్థితిని మార్చాలి. మన పొరుగుదేశం చైనానే చూడండి.. అక్కడి కేంద్ర ప్రభుత్వం, స్థానిక ప్రభుత్వం, పౌరులు– సమభాగస్వాములుగా తలక్కింటికి 10 యువాన్‌లు ఆరోగ్య పరిరక్షణ నిధికి సమకూరుస్తారు. పౌరులకు వైద్యసేవలు అందించిన ప్రభుత్వ ఆసుపత్రులు ఈ నిధి నుంచి సొమ్ము రాబట్టుకుంటాయి. ఇలా వైద్యరంగంలో ఏర్పాటయ్యే సహకార వ్యవస్థ వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. మనదేశంలోనూ అలాంటి వ్యవస్థను ప్రవేశపెట్టవచ్చు. తాలూకా స్థాయిలో మరిన్ని ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పాల్సిన అవసరం ఉంది. ఈ ఆసుపత్రుల నిర్వహణ కోసం ఓ ఆరోగ్య నిధిని ఏర్పాటు చేయాలి. దానికి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, వ్యక్తులు ఏడాదికి తలక్కింటికి ఇరవై రూపాయల చొప్పున చెల్లించారనుకుందాం. ఈ రకంగా– మనిషికి అరవై రూపాయల నిధి జమపడుతుంది. ప్రజలు ఈ సొమ్మును పంచాయతీలకు లేదా మునిసిపాలిటీలకు చెల్లించాలి. ఆ సొమ్ము కూడా చెల్లించలేనివారుంటే– ఆ మొత్తాన్నీ ప్రభుత్వ సబ్సిడీగా అందించాలి. ఆ రకంగా భారతదేశం మొత్తం మీద రూ.6000 కోట్లు జమపడుతుంది. ఇలా ఎక్కడికక్కడే వచ్చే సొమ్మును జిల్లా స్థాయిలోనో, డివిజన్ స్థాయిలోనే ప్రాంతీయ వైద్యాధికారి వద్ద ఉంచాలి. ప్రభుత్వం ఆసుపత్రి భవనాలు నిర్మించి అక్కడ మౌలిక సదుపాయాలు, పరికరాల కల్పనకు పరిమితమవుతుంది. ఆసుపత్రి నిర్వహణ, రోగి మీద చేసే ఖర్చు జీతభత్యాలు వంటి వాటికి ప్రభుత్వం ఎలాంటి బడ్జెట్‌నూ కేటాయించదు. రోగులు తమ ప్రాంతంలోని ఏ ప్రభుత్వ ఆసుపత్రికైనా వెళ్లవచ్చు. రోగుల ఆరోగ్య పరిరక్షణ పట్ల ఆసుపత్రివారు శ్రద్ధ తీసుకోవాలి. రోగుల కోసం చేసే ఖర్చును ఆ నిధి నుంచి రాబట్టుకోవాలి. ఇలా రాబట్టుకునే సొమ్ములో ఏయే వ్యాధి చికిత్సకు ఎంతెంతో నిపుణుల కమిటీ ముందుగానే నిర్ణయిస్తుంది. ఉదాహరణకు కంటిలో శుక్లం తొలగింపునకు రూ.600 నుంచి 1000 వరకు ఖర్చవుతుందని నిపుణుల కమిటీ నిర్ణయిస్తే– తదనుగుణంగానే నిధి నుంచి సొమ్ము తిరిగి రాబట్టుకోవాలి. ఈ విధానంలో– ఆసుపత్రులు పాటించాల్సిన ప్రమాణాలు నిర్ణయమవుతాయి. ఆ ప్రాంతంలోని గుర్తింపు పొందిన ప్రైవేటు ఆసుపత్రులకు రోగులను పంపే ఏర్పాటు చేసి, వాటికీ అదే తరహాలో నిధి నుంచి సొమ్ము పొందే వీలు కల్పించాలి. అలాంటి పరిస్థితుల్లో.. తాము అందించే మెరుగైన సేవల ప్రాతిపదికగానే ప్రభుత్వ ఆసుపత్రులు రోగులను ఆకర్షించగలుగుతాయి. అలా రోగులకు చేరువకాగలిగినప్పుడే వాటికి నిధులంది అక్కడి సిబ్బందికి జీతభత్యాలు ఇవ్వగలుగుతాయి. ఈ విధానం ప్రభుత్వాసుపత్రులు పటిష్టం కావడానికి, రోగులకు సరైన ప్రత్యామ్నాయాలు లభించడానికి, ఆసుపత్రుల మధ్య ఆరోగ్యకరమైన పోటీకి, పేదవారికి ఆరోగ్యభద్రత కల్పించడానికీ దోహదపడుతుంది.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా అక్టోబర్ 4, 2004న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం) ■

# సొంత డబ్బాలూ - శోక రసాలూ

- శ్రీరమణ

"**చూ**డండి, ఈ దేశం వెలిగిపోతోంది. స్వాతంత్ర్యం వచ్చాక ఇలాంటి స్ఫటిక స్వచ్ఛమైన, నీతి శుద్ధమైన, అపార పారదర్శకమైన, ఆదర్శమైన సుపరిపాలన నా ప్రజలకు అందలేదు. భవిష్యత్తు కూడా ఇలాగే వెలుగులు విరజిమ్ముతుంది....." ఎవరా అంటున్నదని ఉలిక్కిపడి చూశాను. భారతీయ జనతా పార్టీ వారు నరేంద్ర మోదీ మాస్క్ తగిలించుకుని అరుస్తున్నారు. "ఏమాత్రం జంకు కొంకు లేకుండా, అంతలా శంఖం ఊదుకోవడం భాజపాకే చెల్లిందండీ. ఇన్ని కబుర్లు చెబుతారు. ఏది... రామమందిరం ఏది? అసలా ప్రస్తావనే లేదు..." అంటూ ఓ సాధువు వేష్టపడ్డాడు.




ప్రపంచం కళ్లు తిరుగుతున్నాయి. పేరెన్నికగన్న నగరాలు మన హైదరాబాదుని చూసి సిగ్గుపడుతున్నాయి. ఎవరైనా నెగెటివ్‌గా మాట్లాడితే మీరు ఖాతరు చేయవద్దు. దద్దమ్మలు ఈర్ష్యతో అట్లాగే కూస్తారు- విజయోత్సవ వేళ తెలంగాణ సందేశం. ఇక చంద్రబాబు శోక రసం నవ నిర్మాణ దీక్ష "కట్టుబట్టలతో మనల్ని వీథిన పడేశారు. అప్పు నెత్తిన పెట్టారు. అయినా నేవున్నా. భయం లేదు. నాకు విజన్ ఉంది." అంటూ సెంటర్లో రికార్డు వేస్తున్నారు. సెంటర్ అంటే గుర్తొచ్చింది. బెజవాడ బెంజి సర్కిల్ పేరు మార్చాలి. మాంఛి లాభసాటి పేరేదైనా పెడితే క్లిక్ అవుతుంది. ఎందుకంటే 'బెంజి' అనేది బూర్జువాకి ప్రతీక. బంగారు తెలంగాణ ఉత్సవాలకి రెండొందల యాభై కోట్లు అయితే అయిందిగానీ, ఆ వెలుగు కనిపించింది. ఈసారి గవర్నర్‌గారికి బత్తిగా పోర్షన్ లేకుండా పోయింది. చిన్న డైలాగైనా లేకపోయె. అక్కడ నవ నిర్మాణ దీక్షలోనూ ఆయనకు పాత్ర లేదు- కృష్ణరాయబారం సీన్‌లో సహదేవుడిలాగా.

"ఎన్నికల ఖర్చు మీద నిఘా పెట్టినట్టు ఇట్లాంటి పబ్లిసిటీ వ్యయాల మీద కూడా నిఘా ఉండాలి. సంబురాలు మంచిదేగానీ ప్రజాధనం దీపాల చమురుకి తగలబెడితే పాపం కదండీ" అని ఒక చాదస్తుడు వాపోయాడు. "కనీసం పగటిపూట మద్యపానం మీద నిషేధం పెట్టే ఆలోచన చేస్తారనుకున్నా. ఒక్కడికీ దమ్ము లేదు." అంటూ ఒక మాజీ దేశభక్తుడు బాధపడ్డాడు. ఇంతలో ఓ ఊరేగింపు నడిచింది. "తెలంగాణ కాంగ్రెస్ పెట్టిన భిక్ష. సోనియాకి కాల్మొక్కి ధన్యవాదాలు చెప్పాలి. సోనియా గాంధీ- జిందాబాద్" అంటూ ఊరేగింపు నినదించింది. ఆ కాంగ్రెస్ ఊరేగింపుకి అరవై కాళ్ల కంటే లేవు. మోదీ 'గంగాజలం' పోస్టాఫీసుల్లో అమ్మిస్తారట! బోలెడు పుణ్యం అంటూ ఓ వెర్రివాడు వికటాట్టహాసం చేసి, మేం షారాయి, బ్రాందీ అమ్మిస్తాం. సవాల్- ఈల వేసుకుంటూ వెళ్లిపోయాడు.

మంత్రులు, సామంత్రులు, సలహాదారులు ఏది మాట్లాడినా, పెద్దాయన మాటగానే వినిపిస్తారు. న్యూస్‌రీడర్లు వార్తలు వినిపించినట్టు నిమిత్తమాత్రంగా ఉంటారు. టీడీపీ రాజ్యసభ సభ్యుడు, కేంద్ర మంత్రి సుజనా చౌదరి అప్పట్నించీ ఒకే ఒక్క మాట మీద ఉన్నారు. "మా నాయకుడి అభీష్టం మేరకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం కృషి చేస్తా." రెండేళ్లుగా మాట తప్పలేదు. "అదే మన తక్షణ కర్తవ్యం" అంటూ మిగిలిన ఢిల్లీ గళాలు కోరస్ పాడతాయి. ఒక చాలా సీనియర్ ఐఏఎస్ చెప్పారు- "సహచరులు సలహాదారులు బయట సలహాల నుంచి నేతని కాపాడటానికే. వీళ్లు తిన్నంత తినొచ్చు కానీ నో పార్శిల్స్. ఇదే మన రాజ్యాంగ నియమం." ఇంకా చాలా చెప్పారు- నగ్న సత్యాలు.

(కర్టెసీ: సాక్షి)

# అప్పులపై ఆంధ్రప్రదేశ్ మేల్కోవాలి

**ఆం**ధ్రప్రదేశ్ అప్పుల ముప్పులో ఉందని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) హెచ్చరించింది. అప్పులు–ఆదాయం మధ్య సమతౌల్యం తప్పుతోందని, వచ్చే ఏడేళ్లలో చెల్లించాల్సిన అప్పులు రూ.55,618 కోట్ల మేర ఉంటాయని అంచనా వేసింది. ఇది మరిన్ని అప్పులకు దారి తీసి బడ్జెట్‌లపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఇప్పటికే రాష్ట్రం ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలను దాటి అప్పులకు వెళ్లినట్లు గుర్తుచేసింది. ఇప్పటి నుంచి మేల్కొంటేనే రాష్ట్రం అప్పుల ఊబి నుంచి బైటపడగలుగుతుందని సూచించింది.




రాష్ట్ర విభజన తర్వాత తొలి ఏడాదికి (2014–15) సంబంధించిన ఆర్థిక పరిస్థితులపై కాగ్ రూపొందించిన ఆడిట్ రిపోర్టును ఏపీ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది.

**ఏపీ ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన పలు లోపాలను కాగ్ తన నివేదికలో పేర్కొంది. అందులోని ముఖ్యాంశాలు :**

- ప్రభుత్వం తీర్చాల్సిన మొత్తం అప్పులు 2015 మార్చి 31 నాటికి రూ.1,07,637 కోట్లు. ఇందులో 50శాతం మొత్తాన్ని ఏడేళ్లలో తీర్చాల్సి ఉంది. దీనివల్ల రాష్ట్రం మరింత అప్పుల ఊబిలో కూరుకుపోవచ్చు. 2018–20లో రూ.19,797కోట్లు, 2020–22లో రూ.20,062కోట్లు తీర్చాల్సిరావడం వల్ల ఈ సంవత్సరాలలో ప్రభుత్వ బడ్జెట్‌పై భారం పడనుంది. కాబట్టి మరిన్ని అప్పులకు వెళ్లకుండా చెల్లింపుల వ్యూహాన్ని ప్రభుత్వం రూపొందించుకోవాలి.
- పెరుగుతున్న రుణ, వడ్డీ భారాన్ని భరించేంత ఆదాయం రాష్ట్రానికి రావాలంటే వనరుల సమీకరణ వేగవంతం చేసుకోవటంతోపాటు అనుత్పాదక వ్యయాన్ని బాగా తగ్గించుకోవాలి. కొత్త రుణాలను పాత అప్పులు తీర్చేందుకుకాకుండా మరిన్ని ప్రయోజనాలకు వాడుకునేలా ఉపయోగించుకోవాలి.
- 2015 మార్చి 31 నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికున్న మొత్తం అప్పు జీఎస్‌డీపీలో 32.02శాతం. ఎఫ్ఆర్‌బీఎం చట్టం నిర్దేశించిన 27.60శాత కంటే ఇది అధికం.
- విభజన జరిగిన తర్వాత రెవిన్యూ రాబడులు అంచనాలు తప్పాయి. ఈ ఏడాది రూ.92,078 కోట్ల ఆదాయాన్ని అంచనా వేయగా, రూ.14,06 కోట్లు తగ్గి రూ.90,672 కోట్లు మాత్రమే వచ్చింది.
- 13వ ఆర్థిక సంఘం చేసిన రూ.10,611.35 కోట్ల గ్రాంటును పూర్తిగా అందుకోలేకపోయారు. 2014–15 ఆర్థిక సంవత్సరానికి రూ.7,665.84కోట్లే అందుకోగలిగారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించటంలో విపరీత జాప్యం చేయటం, చేసిన పనులకు వినియోగ ధ్రువపత్రాలు సమర్పించకపోవడం, ఇతర నిబంధనలను పాటించకపోవడం వల్ల రూ.2,945.51 కోట్ల గ్రాంట్లు తగ్గాయి.
- 2014–15 ఆర్థిక సంవత్సరంలో రెవిన్యూ వ్యయం పెరిగిపోయింది. బడ్జెట్‌లో రెవిన్యూ వ్యయం కింద రూ.98,142కోట్లు అంచనా వేయగా అది చివరకు రూ.1,14,866 కోట్లకు చేరింది. ఇది జీఎస్‌డీపీలో 22.09శాతానికి సమానం. ఇందులో 78.92శాతం మొత్తాన్ని రెవిన్యూ రాబడుల నుంచి ఖర్చు చేయగా, మిగిలిన ఖర్చుల కోసం రూ.24,194 కోట్లు అప్పు తెచ్చారు.
- రాష్ట్ర ప్రభుత్వం 2014–15లో అభివృద్ధి కోసం తగిన నిధులు కేటాయించినప్పటికీ అవి పూర్తిగా విడుదలయ్యేలా చూడలేదు.
- ఈ సంవత్సరం రూ.1,46,055.94 కోట్ల బడ్జెట్ కేటాయించి వాస్తవంగా రూ.1,40,803.15 కోట్లు ఖర్చు చేశారు. అయినప్పటికీ అనుబంధ కేటాయింపుల కింద రూ.33,933.49 కోట్లు మంజూరు చేశారు. వాస్తవ కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయలేనప్పుడు ఈ అనుబంధ కేటాయింపులు చేయటం అనవసరం.

- శాసనసభ ఆమోదం లేకుండానే ఈ ఏడాది రూ.13,134.68 కోట్ల మేర అదనంగా ఖర్చు చేశారు
- రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కొన్ని రుణాలను బడ్జెట్‌లో చూపడం లేదు.
- ఆర్థిక సంవత్సరం చివరి రోజున రూ.16,379కోట్లకు పునఃకేటాయింపుల (రీఅప్రాప్రియేషన్) ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఏడాది చేసిన మొత్తం వ్యయంలో ఇది 11.63శాతానికి సమానం. ఈ ఉత్తర్వులు జారీ చేసినప్పుడు అందులో స్పష్టమైన కారణాలు చూపాలి. కానీ 11,495 అంశాలకుగాను 9,965 పునఃకేటాయింపుల్లో నిర్దిష్టమైన కారణాలేమీ చూపలేదు.




- బడ్జెట్ వ్యయం సంవత్సరమంతా సమానంగా ఉండాలి తప్పితే చివరి నిమిషంలో హడావుడి చేయకూడదు. చివరి త్రైమాసికంలో 34శాతం చేశారు. అందులోనూ ఒక్క మార్చిలోనే 24శాతం ఖర్చు చేశారు.
- ఉప ప్రణాళిక కింద ఎస్సీలకు 17.10శాతం, ఎస్టీలకు 5.33శాతం నిధులు కేటాయించాల్సి ఉంటే, 16శాతం, 5.2శాతం కేటాయించారు. ఎస్సీ నిధులు 31శాతం, ఎస్టీ నిధులు 60శాతం ఖర్చు చేశారు. ఎస్సీ నిధుల్లో రూ.1,418.59 కోట్లు, ఎస్టీ నిధుల్లో రూ.582.76 కోట్లు పున:కేటాయింపు చేశారు. ఇది పథకం అమల్లోని అసమర్థతకు అద్దం పడుతోంది. ఎస్సీ నిధుల్లో రూ.402 కోట్లు, ఎస్టీ నిధుల్లో 177కోట్లు మిగులును సరెండర్ చేశారు.

## 274 ప్రాజెక్టులు అసంపూర్ణం.. గుత్తేదారులకు లబ్ధి చేకూరేలా వ్యవహారశైలి

ఆంధ్రప్రదేశ్‌లోని 274 ప్రాజెక్టులు అసంపూర్ణంగా ఉన్నట్టు కాగ్ తేల్చింది. వీటిపై పెట్టిన రూ.36,646కోట్ల నిధులు నిలిచిపోయినట్టు ఆక్షేపించింది. ప్రాజెక్టులు ఆలస్యమయ్యేకొద్దీ వాటి అంచనాలు పెరుగుతున్నాయని, దీనివల్ల రాష్ట్రం ఆశించిన ప్రయోజనాలేమీ నెరవేరటం లేదని పేర్కొంది. నీటిపారుదల, రహదారుల విభాగాలలో నిర్మాణపనులు, ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయి. జాప్యం వల్ల వీటి వ్యయం పెరిగింది. అసంపూర్తి ప్రాజెక్టులు, పనులపై 2015నాటికి రూ.32,646కోట్ల పెట్టుబడి పెట్టారు. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం 2015 మార్చి 31 నాటికి పూర్తికావాల్సిన 274 ప్రాజెక్టులు పూర్తి కాలేదు. ఇందులో 63 ప్రాజెక్టుల తొలి అంచనాలను సవరించారు. రూ.24,182.44 కోట్ల మేర పెంచారు. గుత్తేదారులకు లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నారు.


## సామాజిక అవసరాల పనులు చేపట్టలేదు

రాష్ట్రంలో మురికివాడల అభివృద్ధి పథకాల అమలు ప్రణాళిక, ఆచరణ లోపభూయిష్టంగా ఉంది. వీటి అభివృద్ధికి ప్రాజెక్టు నివేదికల తయారీ నుంచి పనులు పూర్తయ్యాక వాటిని డీ నోటిఫై చేయటం వరకూ ఏదీ పద్ధతి ప్రకారం జరగటం లేదు అని కాగ్ ఆక్షేపించింది. కచ్చితంగా తరలించాల్సిన ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న 35 మురికివాడల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. తిరుపతి, విజయవాడల్లో సేంద్రీయ ఎరువుల కర్మాగారాలు నెలకొల్పినా వాటిని ఉపయోగించటం లేదు. వైద్యశాలలు జీవవ్యర్థాలను శుద్ధి చేయటానికి, నిర్వీర్యం చేయటానికి నిబంధనలతో మునిసిపాలిటీలు స్పష్టమైన ఆదేశాలనివ్వటం లేదు. ఈ-వ్యర్థాలను విడదీసే ప్రక్రియ సేకరణ దశలోగానీ, డంపింగ్ యార్డుల్లోగానీ చేపట్టటం లేదు.

### 29 అంశాల్లో పదింటినే బదలాయించారు.. వికేంద్రీకరణ ఏదీ?

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సహా పేదరిక నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన పథకాల అమలుతీరును సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ, జవాబుదారీతనం, పారదర్శక సంస్థకు స్వతంత్రత లోపించిందని కాగ్ విమర్శించింది. గ్రామ పంచాయతీలో ఏం చేయాలో గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శే ఆదేశిస్తున్నారు. ఈ పద్ధతి మారాలి. వికేంద్రీకరణ జరగాలి. పంచాయతీరాజ్ సంస్థల ఆర్థికాంశాలపై సమగ్ర స్వరూపాన్ని తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక పద్ధతిని రూపొందించాలి. పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించాల్సిన 29అంశాలలో కేవలం పదింటినే బదిలీ చేశారు. వివిధ విభాగాల్లో 33శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్థానిక సంస్థలకు నిధుల బదలాయింపునకు తానే నియమించుకున్న ఆర్థిక సంఘం సిఫార్సులను కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయటం లేదని కాగ్ తెలిపింది. ■

# తెలంగాణకూ అప్పుల ముప్పు




ప్రస్తుత రుణాల్లో సగానికిపైగా వచ్చే ఏడేళ్లలో తిరిగి చెల్లించాల్సి ఉన్నందున తెలంగాణ కూడా అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం పొంచివుందని భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక హెచ్చరించింది. విద్యారంగంపై ఖర్చు మిగతా రాష్ట్రాలకంటే తక్కువగా ఉందని తెలిపింది. తెలంగాణ 2014-15 బడ్జెట్‌ను రూ.లక్ష కోట్లతో ప్రవేశపెట్టగా, అందులో కేవలం రూ.60,529కోట్లే ఖర్చు పెట్టినట్టు పేర్కొంది. అవాస్తవిక అంచనాలతో రూపొందించిన బడ్జెట్ వల్ల సర్కారు ప్రకటించిన అనేక నిర్ణయాలు అమలు కాలేదని తెలిపింది. విలువ ఆధారిత పన్ను (వ్యాట్), దస్తావేజులపై స్టాంపు రుసుం, వాహనాల పన్నులు, సుంకాల వసూళ్లలో అనేక లసుగులను కాగ్ ప్రస్తావించింది. సరిచేసుకోవాలని సూచించింది. తెలంగాణ రాష్ట్రానికి 2015 మార్చి నాటికి రూ.79,880కోట్ల మేర అప్పులున్నాయి. ప్రభుత్వ హామీలూ రుణ బాధ్యతలవుతాయి. అప్పుల్లో సుమారు 50శాతాన్ని తెలంగాణ సర్కారు ఏడేళ్లలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. దీనికి తోడు, తన అవసరాలకు మళ్లీ భారీగా రుణాలు తీసుకుంటుంది. అందువల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదముందని కాగ్ హెచ్చరించింది.

తెలంగాణకు సంబంధించిన కాగ్ తొలి నివేదిక ఆర్థిక రంగం, రాబడులు, స్థానిక సంస్థలు వంటి 8 కీలక రంగాలను స్పృశించింది. పరంపరగా వచ్చిన గత ప్రభుత్వాల తప్పులను కూడా ప్రస్తావిస్తూ, వాటిని సరిచేసేందుకు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఏమేరకు సమర్థవంతంగా పనిచేసిందో చెప్పే ప్రయత్నం చేసింది.

రాష్ట్రం బడ్జెట్ బయట అనేక హామీలనిచ్చి భారీగా రుణాలను తేవాలని యోచిస్తున్న తరుణంలో అలాంటి వాటిపైనా కాగ్ ఈ నివేదికల్లో అప్రమత్తం చేసింది. ఇలాంటి పూచీకత్తులు రూ.18,265 కోట్ల మేర ఉన్నాయని, ఇవి కూడా ప్రభుత్వానికి రుణబాధ్యతలుగా మారొచ్చని పేర్కొంది. బడ్జెట్ తయారీ, నిర్వహణలో చాలా లోపాలున్నాయని వాటిని విశ్లేషించింది.

## వివరాలు లేకుండానే కేటాయింపులు

శాఖల నుంచి నిర్దిష్ట వివరాలు లేకుండానే రూ.2,555కోట్ల మేర గంపగుత్త కేటాయింపులు జరిపారని కాగ్ ఆక్షేపించింది. సోలార్ పంప్‌సెట్లకు, కల్యాణలక్ష్మి వంటి పథకాలకు కేటాయించిన డబ్బుల్ని కూడా ఖర్చు చేయలేదు. స్థానిక పాలనకు సంబంధించిన నిధుల్ని కూడా సక్రమంగా వినియోగించలేదు.

## మిగులున్నా దోషాలు

తెలంగాణ 2014-15లో రూ.369 కోట్ల మేర రెవిన్యూ మిగులును సాధించింది. జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ కోసం జమచేయాల్సి ఉన్న రూ.651 కోట్లను లెక్కగట్టాల్సి ఉందని, మరో రూ.690 కోట్ల మేర వర్గీకరణ దోషముందని, రెవిన్యూ మిగులును ఈ విషయాల్ని కూడా దృష్టిలో పెట్టుకునే చూడాలని కాగ్ విశ్లేషించింది. 2014-15లో అభివృద్ధి వ్యయానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇచ్చినా కేటాయించిన నిధులు పూర్తిగా విడుదలయ్యేట్టు చూడలేదని పేర్కొంది. ముఖ్యంగా విద్యారంగంలో చేసిన ఖర్చు మొత్తం వ్యయంలో 11.57శాతం మేరే ఉంది. మిగతా రాష్ట్రాల్లో ఈ సగటు 16.23శాతం. మొత్తం వ్యయంలో సామాజిక రంగంపై చేసిన వ్యయం వాటా 34.42శాతమే ఉంది. ఇతర రాష్ట్రాల సగటు 36.50శాతంతో పోలిస్తే ఇదీ తక్కువే. పథకాలను అమలుచేయాల్సిన సంస్థలు వినియోగ ధ్రువీకరణ పత్రాలను పంపటం లేదు. పీడీ ఖాతాలు, పరిపాలన అధికారి పుస్తకాలు, బ్యాంకు నివేదికల మధ్య భారీ వ్యత్యాసాలు కనిపించాయి. పీడీ ఖాతాలపై పర్యవేక్షణ, నియంత్రణలను మెరుగుపరుచుకోవాలని కాగ్ సూచించింది.

మొత్తం వ్యయంలో 44శాతాన్ని చివరి త్రైమాసికంలో హడావుడిగా ఖర్చు పెట్టటం తగదని పేర్కొంది.

### మచ్చుకు తనిఖీ.. రూ.393కోట్ల రాబడికి గండి

పన్నులు, సుంకాల వసూళ్లు, విధింపు వ్యవహారాల్లోనూ అనేక లసుగులు బైటపడ్డాయి. వ్యాట్, ఎక్సయిజ్, రిజిస్ట్రేషన్లు, వాహనాల పన్నులకు సంబంధించిన 1299 కేసులను కాగ్ మచ్చుకు తనిఖీ చేయగా, వాటిలో రూ.393కోట్ల మేర తక్కువగా విధించటం/అసలు విధించకపోవటం జరిగినట్టు తేలింది. 2014-15లో రాష్ట్రానికి రూ.51,041 కోట్ల మేర రాబడులు లభించాయి. ఇందులో రూ.29,288కోట్లు (70శాతం) రాష్ట్ర సొంత పన్నుల ద్వారా, రూ.6,446 కోట్లు పన్నులకాని రాబడుల ద్వారా సమకూరాయి. మిగతా 30శాతం కేంద్రం నుంచి అందాయి. ఇందులో కేంద్ర పన్నుల్లో వాటాగా రూ.7,118కోట్లు, గ్రాంట్లుగా రూ.7,118 కోట్లు ఉన్నాయి. మచ్చుకు తనిఖీ చేసిన కేసుల్లో కేవలం వ్యాట్‌కు సంబంధించి రూ.104కోట్ల నష్టం వాటిల్లింది. పన్ను రేట్లను తప్పుగా వర్తింపచేయటం, అపరాధ రుసుం విధించకపోవటం, తప్పుడు విధానాలతో కొనుగోలు పన్నును తిరిగి తీసుకోవటం వంటి లొసుగులు వెలుగుచూశాయి. వ్యాట్‌లో తనిఖీల సంఖ్య పెంచాలని కాగ్ సూచించింది.

### దస్తావేజులకు తక్కువ విలువ

ఆస్తులపరంగా రిజిస్ట్రేషన్ల సమయంలోనూ అనేక అక్రమాలు జరుగుతున్నాయని కాగ్ పరిశీలనలో తేలింది. కేవలం 134 దస్తావేజులను పరిశీలించగా వాటిలో ఆస్తుల విలువను తక్కువగా చూపటం వల్ల ప్రభుత్వానికి స్టాంపు రుసుంలో రూ.2.50 కోట్ల మేర గండిపడింది. రంగారెడ్డి జిల్లాలో 26 దస్తావేజులను తప్పుగా వర్గీకరించటంతో రూ.84కోట్లు ఖజానాకు చేరలేదు. ఎక్సయిజ్‌లోనూ ఇదే పరిస్థితి. 41 తాటికల్లు సహకార సంఘాలకు అర్బన్ ప్రాంతాలకు వర్తించే అధిక రేట్లకి బదులు గ్రామీణ రేట్లను వర్తింపచేయటం వల్ల ఖజానాకు నష్టం వాటిల్లింది. వివిధ శాఖల నుంచి రావలసిన రెవిన్యూ బకాయిలు రూ.11,727 కోట్ల మేర ఉన్నాయి.

### అసంపూర్తి ప్రాజెక్టులు

ఏపీలాగానే తెలంగాణలోనూ అసంపూర్తి ప్రాజెక్టుల వల్ల భారీ నష్టం జరిగింది. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం 2015 మార్చి 31నాటికి పూర్తి కావాల్సిన 109 ప్రాజెక్టులు పూర్తి కాలేదు. వీటిపై అప్పటిదాకా రూ.33,001 కోట్లు ఖర్చయింది. మరోవైపు వీటి అంచనాలు రూ.13,356 కోట్లు పెరిగాయి. జలయజ్ఞం కింద చేపట్టిన ప్రాజెక్టుల్లో 22 అసంపూర్తిగా ఉన్నాయి.

### నిర్లక్ష్యానికి నిలువుటద్దం నిమ్స్

నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిందని కాగ్ ధ్వజమెత్తింది. అధికారుల అలసత్వం కారణంగా కోట్ల నిధులు దుర్వినియోగ మవుతున్నాయని తెలిపింది. ప్రణాళికా లోపానికి పక్కా ప్రతిబింబం బీబీనగర్ నిమ్స్. ఫలితంగా 80.39 కోట్లు నిష్ఫలంగా మారాయి. ప్రధానమంత్రి స్వస్థ్య సురక్ష యోజన కింద రూ.121.91 కోట్లతో నిమ్స్‌లో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాల్లో అధికశాతం ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని వినియోగించే ప్రయత్నం ఇప్పుడూ జరగటం లేదు.

### సంస్థాగత లోపాల 'సాక్షర భారత్'


కనీస అక్షరాస్యత కోసం చేపట్టిన సాక్షర భారత్ కార్యక్రమం సంస్థాగత లోపాలతో సతమతమవుతోంది. గుర్తించిన నిరక్షరాస్యుల్లో 42శాతం మందే ఈ కార్యక్రమం కింద ప్రయోజనం పొందారని కాగ్ తెలిపింది.

- సూక్ష్మస్థాయి ప్రణాళికలు లేకుండానే, మార్గదర్శకాలకు విరుద్ధంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు
- నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవటం లేదు
- ఖర్చుల వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టటంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది
- రాష్ట్ర స్థాయి కార్యాచరణ ప్రణాళికలకూ, వయోజన విద్యాశాఖ లెక్కలకు మధ్య పలు వ్యత్యాసాలున్నాయి
- రాష్ట్రం మొత్తం మీద మహిళల నమోదు ఐదు విడతల్లో కలిపి 41.87 లక్షలు ఉండగా, చదువు నేర్చుకున్నవారి సంఖ్య 28.52లక్షలు మాత్రమే. ఉపాధి అవకాశాలు లేక వలసపోతుండటం వల్ల మహిళల్లో చదువు మానేస్తున్నవారి సంఖ్య ఎక్కువగా ఉంది.
- కొన్ని పంచాయతీల్లో నూరుశాతం అక్షరాస్యత సాధించాక కూడా కార్యక్రమం కొనసాగుతోంది. ■

# 'ప్రత్యేక' పోరాటం చేయాలి

- కూసంపూడి శ్రీనివాస్,
ఏపీ అధికార ప్రతినిధి, లోక్‌సత్తా పార్టీ

**కాం**గ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాపై ప్రవేశపెట్టిన ప్రయివేటు బిల్లు చర్చకు రాకుండానే పార్లమెంటు సమావేశాలు వాయిదా పడ్డాయి. ఈ బిల్లుపై ఓటింగ్ పెడితే మద్దతు తెలపాలని బీజేపీతో అధికారం పంచుకుంటున్న తెలుగుదేశం పార్టీతోపాటు కాంగ్రెస్, జేడీయూ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, ఎస్పీ తదితర పార్టీలన్నీ నిర్ణయించుకున్న తరుణంలో ఇలా అర్ధంతరంగా సమావేశాలు వాయిదాపడటం తెలుగు ప్రజలను మరోసారి నిరాశకు గురిచేసింది. అయితే ఏప్రిల్ 29వ తేదీనే కేవీపీ ప్రవేశపెట్టిన ప్రయివేటు మెంబర్ బిల్లుపై జరిగిన చర్చకు జవాబుగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హెచ్‌పి చౌదరి సమాధానమిస్తూ, పన్ను ప్రోత్సాహకాలు, కేంద్ర సాయం అందిస్తున్నందువల్ల ఏపీకి ప్రత్యేక హోదా అవసరం లేదని కుండబద్దలు కొట్టారు. దీనితోపాటు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి జయంత్ సిన్హా 'ఏపీకి ప్రత్యేక హోదా అర్హత లేదు' అంటూ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో తేల్చేయడంతో రాష్ట్రంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ప్రత్యేక హోదా డిమాండ్‌తో ఉద్యమాలకు పిలుపునిచ్చాయి. ఈ విషయంపై అన్ని రాజకీయ, ప్రజాసంఘాలతో అఖిలపక్షాన్ని ఏర్పాటుచేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అధికార తెదేపా మిత్రధర్మం పేరుతో వెనుకంజ వేస్తుంటే, అఖిలపక్షాన్ని వేయాలని కోరే ప్రతిపక్ష వైకాపా, మిగతా అన్ని రాజకీయ, ప్రజాసంఘాలు ఒక్కతాటిపైకి వచ్చి పోరాడాల్సిందిపోయి ఎవరికివారే కార్యాచరణలు ప్రకటించుకుంటూ, ఉద్యమాలకు పిలుపునిస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు.




ఒకవైపు కేంద్రప్రభుత్వం పన్నురాయితీలు, ప్రత్యేకసాయం అందిస్తున్నామని చెబుతున్నా ఏపీకి ప్రత్యేకించి ఇచ్చిందేమీ లేదనేది మనమంతా ఇక్కడ గమనించాల్సిన విషయం. 14వ ఆర్థికసంఘం సిఫార్సుల ప్రకారం అన్ని రాష్ట్రాలతో సమానంగా జనాభా నిష్పత్తి ప్రకారం విడుదల చేసిన నిధులే తప్ప ఏపీకి ప్రత్యేకంగా ఏమీ రాలేదని రాష్ట్ర ఆర్థికశాఖ ఇప్పుడు తలబద్దలు కొట్టుకుంటోందిగానీ, 2015 అక్టోబర్‌లోనే లోక్‌సత్తా ఈ విషయాన్ని మీడియా ద్వారా ప్రజలకు స్పష్టమైన గణాంకాలతో సహా తెలియచేసింది. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ సంబంధిత పత్రాలను కూడా విడుదల చేశారు. 2015-2020 గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా.. కేంద్రం నుంచి 42శాతం నిధుల్ని బదిలీ చేసినా రెవిన్యూ లోటు ఉన్న అన్ని రాష్ట్రాలకూ ఆర్థికసాయం అందిస్తున్నట్టు 14వ ఆర్థికసంఘం నివేదికలో స్పష్టంగా ఉందనీ, రెవిన్యూ లోటు భర్తీ కింద వచ్చే ఐదేళ్లలో ఏపీకి రూ.22,113కోట్లు ఇస్తుండగా, పశ్చిమ బెంగాల్‌కు రూ.11,760 కోట్లు, చిన్న రాష్ట్రమైన కేరళకు రూ.9,519 కోట్లు ఇస్తున్నారని, ఇది అందరూ గుర్తించాలని లోక్‌సత్తా ఆనాడే చెబితే, ఆరునెలల తర్వాత ఆర్థికశాఖ విస్మయం ప్రకటించడం విడ్డూరం.

ఇక ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సెంటిమెంట్‌గా తయారైన ప్రత్యేక హోదా విషయానికొస్తే, ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక తరగతి హోదా ఇవ్వడానికి ప్రణాళికా సంఘం రద్దవుతుందని

కొన్నాళ్లు, ఇతర రాష్ట్రాలు అడ్డుపడుతున్నాయని కొన్నాళ్లు, నీతి ఆయోగ్ నివేదిక ఇస్తుందని కొన్నాళ్లు కాలం గడుపుతూ వచ్చిన కేంద్రం ఇప్పుడు పన్ను ప్రోత్సాహకాలు, కేంద్ర సాయం ఇస్తున్నందు వల్ల ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం లేదని కొన్ని టెక్నికల్ కారణాలు చూపిస్తూ ఏపీకి హోదా విషయంలో వెనుకంజ వేస్తోంది. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో చేసే వాగ్దానాలను అధికారంలోకి రాగానే మర్చిపోవడం మామూలైపోయింది. అయితే, ఒక ప్రాంత ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశాలపై ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోకపోతే వారి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్న సత్యం అటు రాష్ట్ర ప్రభుత్వానికిగానీ, ఇటు కేంద్రప్రభుత్వానికిగానీ తెలియనిది కాదు. విభజన వల్ల ఏటా రూ. 16వేల కోట్ల రూపాయల రెవిన్యూ లోటు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కి కేంద్రం ఎంత సాయం చేసినా ప్రత్యేక హోదా వల్ల వచ్చే లబ్ధిని తక్కువగా అంచనావేయకూడదు. ఇంత ముఖ్యమైన ప్రయోజనం విషయంలో తాత్సారం చేస్తూ రాష్ట్ర లాభాల్ని పక్కనబెట్టి తెదేపా, బీజేపీలు ఒకరిపై ఒకరు తూటాలు పేల్చుకుంటున్నారేతప్ప రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై కేంద్రాన్ని నిలదీసే ప్రయత్నం చేయకపోవడం దారుణం. రాష్ట్ర విభజన సమయంలోనే కాంగ్రెస్, బీజేపీలు హడావుడిగా పునర్విభజన చట్టం రూపొందించి రాష్ట్రాన్ని విడగొడితే, ఆ సమయంలో కూడా మన రాజకీయ పార్టీలు రాష్ట్రం విడిపోతే మనకేమి కావాలో అనే దానిపై సరైన స్పష్టత లేకుండా వ్యవహరించాయి. దాని పర్యవసానమే నేడు ఏపీ ప్రజలు అనుభవిస్తున్నారు.

ఒకవేళ కేంద్రం ప్రత్యేక హోదా ఇచ్చే విషయంలో మాట తప్పితే కనీసం ప్రత్యేక హోదా పేరు అక్కర్లేకుండా 100శాతం కార్పొరేట్, ఎక్సయిజ్ పన్ను రాయితీలను అడిగితే ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు పెరిగి యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయి కాబట్టి ఆ దిశగా ప్రయత్నించాలని అనేకసార్లు లోక్‌సత్తా డిమాండ్ చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించలేదు. సరికదా, ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసినప్పుడు పన్ను రాయితీలు రాష్ట్రమంతటికీ కాకుండా, కేవలం రాజధాని ప్రాంతం అమరావతి, చుట్టుపక్కల ప్రాంతాలకు మాత్రమే కావాలని అడగటం గమనార్హం. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి హోమాలు, యజ్ఞయాగాదుల మధ్య జరిపిన అమరావతి శంకుస్థాపనకు వచ్చిన మోదీ ప్రత్యేక హోదా గురించి ప్రస్తావించకపోగా చంద్రబాబు చేతిలో కాస్త మట్టి, నీరు పెట్టి వెళ్లిపోయారు. ప్రధాని మోదీ చేసిన సాయం గొప్పదంటూ కీర్తిస్తూ మీ దయ, మా ప్రాప్తం అన్నట్టు ఇప్పటికీ చంద్రబాబు వ్యవహరిస్తున్నారే తప్ప.. రాష్ట్ర ఆర్థిక లోటును, రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనకబాటుతనాన్ని గురించి ఎక్కడా ప్రస్తావించటం లేదు. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వం మేలుకోవాలి. రాష్ట్రం మొత్తానికీ ప్రత్యేక హోదా విషయంలో కేంద్రం వెనుకంజ వేస్తే ప్రత్యేక హోదా రాష్ట్రాల కంటే దయనీయంగా ఉన్న రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకైనా ప్రత్యేక హోదా సాయాన్ని అందించాలని కేంద్రాన్ని నిలదీయాలి. ప్రత్యేక హోదా రాయితీల వల్లే హిమాచల్‌ప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానం రాష్ట్రాలతో పోటీపడుతూ దూసుకుపోతోంది. ఈ అవకాశం ఇక్కడా వస్తే రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలు వేగంగా అభివృద్ధి సాధించి యువతకు ఉపాధిని అందిస్తాయనటంలో ఎలాంటి సందేహం లేదు. దీనికి ప్రత్యేక హోదా పేరు మార్చినా ఎవరికీ అభ్యంతరం అక్కర్లేదు. మనకు కావలసింది వెనకబడిన జిల్లాలకు రాయితీలు. దీనివల్ల కేంద్రప్రభుత్వానికి కూడా మున్ముందు ఆదాయవనరులు బాగా పెరుగుతాయి. పాత పరిశ్రమలకు కాకుండా కొత్తగా వచ్చే పరిశ్రమలకు నూరుశాతం ఈ పన్ను రాయితీల్ని కల్పించడం వలన కేంద్రానికి ఆదాయం తగ్గకపోగా దీర్ఘకాలంలో పెరుగుతుంది. ఏదిఏమైనా, ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా సాధించే విషయంలోనూ, విభజన హామీల్ని నెరవేర్చుకునే విషయంలోనూ అధికార తెదేపాతోపాటు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఏకతాటిపైకి వచ్చి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాకాకుండా విభజన సమయంలో విభజన అనివార్యం అని తెలిసి కూడా సమైక్యాంధ్ర అంటూ పోరాటాలు చేసి చివరకు మనకు కావాల్సినవాటిని పునర్విభజన చట్టంలో పొందుపరిచేలా చేసుకోవడంలోనూ, సాధించుకోవడంలోనూ విఫలమై చేసిన తప్పును ఇప్పుడు మరోసారి చేయకూడదు. ఇంకోసారి ఏపీ ప్రజల ఆశలపై నీళ్లు చల్లకూడదు. అటువంటి తప్పిదం జరగకుండా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి అధికార, ప్రతిపక్ష పార్టీలతోపాటు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఏకతాటిపైకి వచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రత్యేక పోరాటం చేయాలని ప్రజలందరూ కోరుకుంటున్నారు. ■

# ఏ వెలుగులకీ 'ఉచితం'?

- డాక్టర్ కొణిదెల నిఖిలేష్



తమిళనాట పురుట్చితలైవిగా, 'అమ్మ'గా అభిమానుల హృదయాలలో జయలలిత స్థానం పదిలంగా ఉన్నదని మరోమారు నిరూపణ అయింది. ఎం.జి రామచంద్రన్ తరువాత ముప్పై ఏళ్ల చరిత్రను తిరగరాస్తూ జయలలిత వరుసగా రెండోసారి అధికారంలోకి రావడం సామాన్యమైన విషయం కాదు. చెన్నై వరదల విషయంలో ప్రభుత్వ వైఫల్యం, పాలన సాగిన అయిదేళ్లలో ప్రదర్శించిన అహంకారం, మధ్యలో జైలు ఎపిసోడ్‌లు, డీఎంకే ముద్ర ఉన్న ఆ పార్టీ పాలనలో మొదలైన అభివృద్ధి పనులలో ఏ ఒక్కదానినీ కూడా ముందుకు సాగనివ్వని అహంభావ వైఖరి, ప్రభుత్వ విధానాలను ఈసడించినందుకు జానపద కళాకారుడు కోవన్‌ను అణచివేసిన దుర్మార్గపు తీరు, తమిళజాతి ఆత్మగౌరవం దెబ్బతినేలా రచయిత పెరుమాళ్ మురుగన్ మీదకు ప్రతీపశక్తుల్ని ఉసిగొల్పిన వైనం.. ఇలాంటివేవీ కూడా జయలలితను అధికార పీఠం దరిచేరనివ్వకుండా ఆపలేకపోయాయి. 13వ సారి శాసనసభకు ఎన్నికై, ఆరోసారి ముఖ్యమంత్రిగా పీఠం అధిష్టించాలని ఆరాటపడిన వృద్ధనేత కరుణానిధి ఆశలను పటాపంచలు చేస్తూ.. జయలలిత మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు.

జయ అధికారంలోకి రావడం కొందరిని విస్మయపరిచింది కూడా. నిజానికి అయిదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ఎగ్జిట్‌పోల్స్ తర్వాత  వచ్చిన గెలుపు అంచనాలు ఒక్క తమిళనాడు విషయంలో గురితప్పాయి. ఇక్కడ డీఎంకేను వరిస్తుందనుకున్న విజయం జయ పరమైంది. అయితే అంచనాలకు అందనంతగా జయ జనాదరణ ఉన్నదా? ఆమె పాలనావైఫల్యాలు కూడా ఆ జనాదరణ వెల్లువలో మరుగునపడిపోతున్నాయా? అనేది సందేహాస్పదమే.

జయలలిత పట్ల జనంలో ఎంతోకొంత వ్యతిరేకత లేదనుకోవడం భ్రమ. అయితే అన్ని పార్టీలు విడుదల చేసిన తర్వాత చివరగా విడుదల చేసిన తన మేనిఫెస్టోలో జయలలిత ప్రకటించిన ఉచిత వరాల వెల్లువ తమిళ ఓటర్లను ఉక్కిరిబిక్కిరి చేసిందని చెప్పాలి. సాధారణంగా తాను నామినేషన్ వేసే రోజే మేనిఫెస్టో విడుదల చేస్తూ, ఆ విషయంలో అందరికంటే ముందుండటం జయలలితకు పరిపాటి. అయితే ఈసారి మాత్రం ఆమె భిన్న వ్యూహం అనుసరించారు. అన్ని పార్టీలు మేనిఫెస్టోలు ఇచ్చేసిన తర్వాత, కొంత వ్యవధి తీసుకుని తన హామీల చిట్టాను, సమ్మోహనాస్త్రాన్ని జనం మీదకు ప్రయోగించారు. పుంఖానుపుంఖంగా ఉచిత వరాలు అందులో ఉన్నాయి. గృహ వినియోగానికి కూడా ఉచిత కరెంటు అనే తరహా బ్రహ్మాస్త్రాలు అనేకం పొందుపరిచి ఆమె మేనిఫెస్టోను సంధించారు. ప్రత్యర్థి పార్టీలను కంగారు పెట్టారు. అయితే ఆమె చెబుతున్న స్థాయిలో ఉచిత హామీలు నెరవేర్చడం సాధ్యం కాదని, అదంతా బూటకమనీ జనాన్ని జయ అయస్కాంత మేనిఫెస్టో వైపు ఆకర్షితులు కాకుండా చేసేందుకు మిగతా పార్టీలు అనేకపాట్లు పడవలసి వచ్చింది. అయినా ప్రత్యర్థులు జనంలో నాటదలచుకున్న భయాన్ని, జయ కల్పించిన ఆశలే జయించాయి. ఆమెను విజయం వరించింది.

ఇప్పటికే తమిళనాట ఎన్నికలు అంటేనే ఇతర రాష్ట్రాల ప్రజలకు ఒక హాస్యాస్పద వ్యవహారం అయిపోయింది. ఇంట్లో

స్టవ్, గ్యాస్, కుక్కర్, మిక్సీ, గ్రైండర్, టీవీ, డిష్ కనెక్షన్, ఫ్రిజ్ ఇలా.. గృహానికి అవసరమైనవి అన్నీ పార్టీలే ఉచితంగా ఇచ్చేస్తాయి అనే హాస్యోక్తులు అనేకం పుడుతున్నాయి. వాటిని జయలలిత తాజాగా మరింత పరాకాష్టకు తీసుకువెళ్లారు. అమ్మకు ఓటు వేస్తే చాలు తమిళనాడులో 'ఉచితం'గా జీవించేయొచ్చు అనే భావన కల్పించారు.

సరిగ్గా ఇక్కడే అసలు ఆలోచన మొదలవుతున్నది. అధికారాన్ని మళ్లీ దక్కించుకోవడానికి రాజకీయ పార్టీలు ఎటుపోతున్నాయో అర్థంకాని పరిస్థితి నెలకొంటున్నది. అధికారంలోకి రావాలంటే జనం ఓట్లు ఒక్కటే మార్గం గనుక, ఆ ఓట్లను సర్కారీ సొమ్ముతో కొనుగోల చేయడానికి పూనుకునే పెడపోకడలు శ్రుతిమించుతున్నాయి. సామాజికంగా అట్టడుగున ఉన్నవారిని పైకి తీసుకురావడానికి ప్రభుత్వాలు చేసే కృషిని ఎవ్వరూ కాదనరు. చేయవలసిన ప్రయత్నాలను తప్పుపట్టరు. అయితే అందుకు కూడా ఒక విధానం, ఒక నిర్దిష్టత ఉండాలి. సాయం చేయదల్చుకున్న వ్యక్తికి చేపను అందివ్వడం కంటే, చేపలు పట్టటం నేర్పు అంటుంది చైనీస్ సామెత. కానీ మన ప్రభుత్వాలు చేపల కూరను ఇవ్వడం అలవాటు చేస్తున్నాయి.

నిమ్న వర్గాలను సామాజికంగా పైకి తీసుకువచ్చి, సామాజిక సమతుల్యత సాధించడం అంటే సంపన్నులకు ఉండే ఫ్రిజ్, ఏసీలను వారికి కూడా సమకూర్చడం మాత్రమేనా? లేక ఆ సంపద చిహ్నాలను తామే పొందగలిగేలా నిమ్న వర్గాల వారి శక్తులను, ఉపాధులను బలోపేతం చేయడమా? అనేది చాలా పెద్ద చర్చ! 'కురచదరుల' (షార్ట్‌కట్స్)ను ఎంచుకునే జయలలిత తరహా నాయకులు ఇచ్చే ఉచిత వరాలు ప్రజలను 'మిథ్యా సంపన్నులు' అనే కొత్త సామాజిక వర్గంగా తయారుచేస్తాయి. వీరి సంపన్నమైన జీవితం గాలి బుడగలాంటిది. అమ్మ ఏలుబడి సాగినంత వరకు, అమ్మ కరుణ ఉన్నంత వరకు వారికి ఇది ప్రాప్తమైఉంటుంది. ఆ తర్వాత మరో ప్రభుత్వం వీటిని కొనసాగించదు. ఒకసారి కోల్పోతే తిరిగి పొందడం వారికి సాధ్యం కాకపోవచ్చు. ఈ మిథ్యాసంపన్నులు అయాచితంగా లభించినదేదో అనుభవించగలరు తప్ప, కష్టార్జితంతో అనుభవించదలుచుకున్న దానిని పొందలేరు. పేదల కోసం పనిచేయడం అంటే ఆ వర్గాలకు ప్రత్యేకించి ఫ్రీ స్కూలు, స్కూలు అవసరాల మీద ప్రభుత్వం నిధులను వెచ్చించి ఆ రంగాలను బలోపేతం చేయడం, నాణ్యమైన విద్యను, వృత్తి విద్యా కోర్సులను, తత్సంబంధిత నైపుణ్యాలను వారికి అందించడం, తద్వారా ఆ వర్గాల ప్రజలను స్వయంసమృద్ధంగా, స్వయంసంచలితంగా తయారుచేయడం అని అంతర్జాతీయంగా నిరూపితమైన సిద్ధాంతాలు చెబుతున్నాయి. పేదలకు నాణ్యమైన విద్య, మంచి వైద్య వసతులను అందుబాటులో ఉంచడం ప్రభుత్వాల బాధ్యత అవుతుందిగానీ, వారిని ఇలా నిస్తేజంగా చేసేయడం సబబు కాదు.

ప్రజల నుంచి పన్నుల రూపేణా వసూలు చేసే సొమ్ములనే తిరిగి ప్రజలకు ప్రభుత్వాలు ఖర్చు చేస్తాయి. అయితే ఈ ఖర్చు ప్రజాజీవనాన్ని స్వయంసమృద్ధంగా తీర్చిదిద్దాలి తప్ప ఉచితంగా ఏం వస్తుందా అని నిరీక్షించేవారిగా ప్రజలను మార్చకూడదు. ప్రజల నుంచి పన్నుల రూపేణా వసూలు చేసే సొమ్ములకు ప్రభుత్వాలు ధర్మకర్తలు మాత్రమే! కానీ జయలలిత వంటివారు ఆ సొమ్ముకు తామే యజమానులం అనే భావనతో ఇలాంటి 'ఉచిత' నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు.

ఒక వ్యక్తికి నిత్యావసరాలన్నీ ఉచితంగా లభించినప్పుడు ఇక అతనిలో 'పనిచేసే దృక్పథం' ఎంతగా పలుచన అయిపోతుందో.. పనిచేసే స్ఫూర్తి ఎలా మంటగలిసిపోతుందో మనం ఊహించవచ్చు. పేదలను ఉన్నతవర్గాలతో సామాజికంగా సమానంగా తీసుకురావడం కాదుగదా.. వారిలోని శక్తులను సమస్తం హరించి, నిర్వీర్యుల్ని చేసే ఒక తరహా కుట్రే ఈ ఉచిత పథకాలు. డ్రగ్స్ మాదిరిగా, ప్రజలకు వాటిని అలవాటు చేసి వారిని ఆ మత్తులో ఎప్పటికీ తమ అధికారపీఠానికి పునాదులుగా వాడుకోవాలనే ఇలాంటి కుహనా రాజకీయ ఆలోచనలు మారవలసిన అవసరం ఉంది.

పేదల అభివృద్ధికి బాటలు వేయడం అంటే వారి జీవితాలను వారు తీర్చిదిద్దుకోగలిగే మార్గాలను నిర్మించడమే. ఇందుకు వారి ఉపాధి సదుపాయాలు, ఉద్యోగ వసతులను సవ్యంగా ఏర్పాటు చేయగలిగితే చాలు. ఒక పేదవాడు చిన్న వ్యాపారం చేయదలిస్తే, ప్రభుత్వ యంత్రాంగం అతన్ని పీడించుకు తినేయకుండా– వ్యవస్థను చక్కదిద్దితే చాలు. ఉపాధుల కల్పన సరళం అయ్యేలా పారిశ్రామికీకరణను ప్రోత్సహిస్తే చాలు. తమిళ నాయకులు ఇవ్వజూపుతున్న 'ఉచితాలు' ప్రజలలోని ఆలోచనాశక్తిని, పనిచేసే తత్వాన్ని, ప్రశ్నించే లక్షణాన్ని ఒక్కొక్కటిగా చంపేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అన్నీ ఉచితంగా లభిస్తే వ్యక్తిగత చొరవ నిర్వీర్యం అయిపోతుంది. సమాజం చైతన్యాన్ని కోల్పోయి నిస్తేజమవుతుంది. జయలలిత వంటి వారు ఇవే పోకడలతో మరింత దూకుడుగా వెళితే పర్యవసానాలు ఏమిటి? ఆమె చేతిలో అధికారం ఉండవచ్చు కానీ పాలించడానికి ప్రజలు, ముఖ్యంగా చైతన్యవంతమైన ఆలోచనలు చేసేవారు మాత్రం మిగలరు.

(కర్టెసీ: ఆంధ్రజ్యోతి) ■


*ఉచిత కలర్ టీవీలు వంటి ఎన్నికల హామీలపై చర్యలు తీసుకోవాలని మే **09, 2008**న కర్ణాటక ఎన్నికల సందర్భంగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కేంద్ర ఎన్నికల సంఘానికి రాసిన లేఖ (మీడియా రిలీజ్)..*

# 'ఉచిత కలర్ టీవీలు' హామీ మూకుమ్మడి లంచమే!

## కర్ణాటక కాంగ్రెస్‌పై చర్య తీసుకోండి

## ... లేకుంటే ఈ జాఢ్యం అన్నిపార్టీలకూ అంటుకుంటుంది

## - కేంద్ర ఎన్నికల సంఘంకు జయప్రకాష్ నారాయణ్ లేఖ -



వచ్చే ఎన్నికల్లో అధికారమిస్తే, ఉచితంగా కలర్ టీవీలను పంచుతామని కర్ణాటకలో కాంగ్రెస్ (ఐ) పార్టీ చేస్తున్న వాగ్దానం ఓటర్లకు మూకుమ్మడి లంచం ఇవ్వటమేనని లోక్‌సత్తా పార్టీ స్పష్టంచేసింది. ఇలాంటి ప్రలోభపూరిత ఎన్నికల హామీలపై తక్షణం చర్య తీసుకుని నిలువరించాలని పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కేంద్ర ఎన్నికల సంఘంకు రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ అవినీతి, అనైతిక ఎన్నికల ఎత్తుగడలకు అడ్డుకట్ట వేయకపోతే ఎన్నికలు బహిరంగ వేలంపాటలుగా మారిపోతాయన్నారు. భవిష్యత్తులో మిగిలినపార్టీలు కూడా దేనికైనా దిగజారి నోటికొచ్చిన హామీలు ఇస్తాయని, ప్రజాప్రాతినిధ్యం నిస్సిగ్గుగా జరిగే మార్కెట్ లావాదేవీగా మారిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు... ఎన్నికల కమిషన్‌కు రాసిన లేఖను శుక్రవారం జయప్రకాష్ నారాయణ్ మీడియాకు విడుదల చేశారు.

ఈ దిగజారుడు ప్రలోభాన్ని తమిళనాడులో 2006 అసెంబ్లీ ఎన్నికల సమయంలో డి.ఎం.కె పార్టీ మొదలుపెట్టిందని జేపీ గుర్తుచేశారు. ఆ సమయంలో ఎన్నికల సంఘం మౌనం వహించటంతో ఇవాళ ఓ జాతీయపార్టీ సైతం అలాంటి హామీకి తెగబడిందన్నారు. రాజకీయపక్షాలు ఓటర్లకు రాయితీలు, వివిధ రకాల సహాయాలు, పథకాలను ప్రకటించటంలో తప్పులేదని, అయితే సంక్షేమంతో ఎటువంటి సంబంధంలేని హామీలివ్వటం మాత్రం ఓటర్లకు లంచమిచ్చి ప్రజాప్రాతినిధ్యం స్థాయిని దిగజార్చటమేనని స్పష్టంచేశారు. "పేదలకు, ఆకలిబాధితులకు సబ్సిడీ బియ్యం ఇస్తామనటంలో తప్పులేదు. ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించిఇవ్వటం, అప్పుల బాధితులైన రైతులకు విద్యుత్ రాయితీ ఇవ్వటం కూడా సమంజసమైన ఎన్నికల హామీలే. ఈ విధానాల వెనక విజ్ఞత, వాటి అమలులో చిత్తశుద్ధి ప్రశ్నార్థకం కావొచ్చు కానీ, ఆ హామీల్ని తోసిపుచ్చలేం. అయితే ఇప్పుడు కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న ఉచిత కలర్ టీవీల హామీకి మాత్రం ఎటువంటి ప్రజాప్రయోజనం లేదు. రాజ్యాంగం నిర్దేశించిన ప్రభుత్వ విధుల పరిధిలోకి ఇది రాదు. ఏరకంగా చూసినా ఎన్నికల ప్రక్రియ పరిధిలోకి రాదు. చట్టబద్ధమైన ఎన్నికల హామీకి, చట్టవిరుద్ధమైన ప్రలోభానికి స్పష్టమైన విభజన రేఖ ఉంది. ఉచిత కలర్ టీవీల హామీ ఎన్నికల ప్రచారంలో విభజన రేఖను దాటినట్టే" అని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.

ఈ ధోరణిని ఉపేక్షిస్తే, రాబోయే కాలంలో ఒక పార్టీ మోటారుసైకిళ్లను, ఇంకోటి రిఫ్రిజిరేటర్లను, మరోపార్టీ కార్లను లంచం చూపిస్తుందన్నారు. పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో ఏటా ప్రతి కుటుంబానికి 100బాటిళ్ల మద్యంను పంపిణీ చేస్తామని పార్టీలు హామీ ఇచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. డబ్బుతో, మద్యంపంపిణీతో ఓట్ల కొనుగోలు ఇప్పటికే దేశంలో సర్వసాధారణమైపోయిందని, ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ప్రధాన సంప్రదాయ రాజకీయపార్టీ ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ. 5కోట్ల మేర ఖర్చు చేస్తోందన్నారు. చట్టబద్ధ సాక్ష్యాలులేకపోవటం వల్ల దీన్ని నియంత్రించ

లేకపోతున్నామని, ప్రజాధనంతో కలర్ టీవీలను ఉచితంగా ఇస్తామని అధికారం కోసం ఓ పార్టీ చేస్తున్న వాగ్దానం మాత్రం ఖచ్చితంగా బహిరంగంగా నిరూపించదగ్గ అవినీతి, తప్పుడు ఎన్నికల ప్రచారహామీ అని అన్నారు. ఈ ఎన్నికల ప్రలోభం మీద తక్షణం చర్య తీసుకోవాలని జయప్రకాష్ నారాయణ్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు.” ■

# అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటాం



అగ్రిగోల్డ్ బాధితులకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు, హాజరైన అగ్రిగోల్డ్ బాధితులు

అగ్రిగోల్డ్ కుంభకోణంపై జులైలో పెద్దఎత్తున పోరాటానికి బాధితులంతా సిద్ధంగా ఉన్నట్టు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ నాయకులు, పలు పార్టీల నాయకులు చెప్పారు. బాధితులకు అండగా అండగా ఉంటామని లోక్‌సత్తా, వామపక్షాలు, వైకాపా నేతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మంగళగిరిలోని ఆచార్య నాగార్జున వర్సిటీ ఎదురుగా ఉన్న స్థలంలో అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన పోరుబాట నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, ఒడిషా రాష్ట్రాల నుంచి కూడా బాధితులు వచ్చారు. రాష్ట్రంలో 20లక్షలకు పైగా ప్రజలకు చెందిన వేల కోట్ల సొమ్మును దిగమింగినా ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తోందని, చట్టం డబ్బున్నవారికి చుట్టంలా వ్యవహరిస్తోందని వివిధ పార్టీల నేతలు ఆరోపించారు. ఈ సమస్యపై సరైన లెక్కలతో, సాక్ష్యాలతో నిర్దిష్ట పరిష్కారాన్ని రూపొందించి పోరాడితే ఫలితం ఉంటుంది తప్ప రాస్తారోకోలు, బంద్‌లు వల్ల బాధితులకు న్యాయం చేకూరదని, ఆ పరిష్కారం కోసం లోక్‌సత్తా తన వంతు ప్రయత్నం చేస్తుందని పార్టీ ఏపీ అధికార ప్రతినిధి కూసంపూడి శ్రీనివాస్ అన్నారు. పోరుదీక్షలో సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె. రామకృష్ణ, పి. మధు, వైకాపా నేత షేక్ మొహమ్మద్ ముస్తఫా, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని ప్రసాద్, రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ అధ్యక్షుడు షేక్ గౌస్, అసోయేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అధ్యక్షుడు శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. ■

# పోర్టు కాలుష్యంపై విచారణకు పట్టు

విశాఖ పోర్టు కాలుష్యంపై జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌చే అధ్యయనం చేయించి సమగ్ర నివేదికను ప్రభుత్వం, ప్రజల ముందుంచాలని లోక్‌సత్తా పార్టీ నేతలు డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ విశాఖ నగర విభాగం అధ్యక్షుడు ఎంఎస్ఎన్ మూర్తి, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు ఎం. రాజశేఖర్ వర్మ నగరంలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు.

నగరంలో ఏటా కాలుష్యం పెరగడానికి విశాఖ పోర్ట్ ట్రస్ట్ కూడా కారణమన్నారు. 60 ఎంజీ/ఎం3 ఉండాల్సిన ఆర్ఎస్‌పీఎం మే నెలలో దాదాపు 80 ఎంజీ/ఎం3 ఉందని రాజశేఖర్ వర్మ అన్నారు. కానీ పోర్టు అధికారులు నియంత్రణలో ఉందని చెప్పటం విడ్డూరమన్నారు. పోర్టు విస్తరణపై ప్రజావ్యతిరేకత ఉన్నా అధికారులు ముందుకెళ్లడం విడ్డూరమన్నారు.

ఇవే వాస్తవాల్ని కాలుష్య నియంత్రణా మండలి (పీసీబీ) ఏటా నివేదికల్లో ధృవీకరిస్తూ వస్తోందన్నారు. బొగ్గు నిల్వల ఎత్తు ఆరు మీటర్లే ఉండాల్సి ఉండగా, 15 మీటర్ల వరకూ ఉందన్నారు. టార్పలిన్‌తో బొగ్గు నిల్వల్ని సరిగా కప్పటం లేదని కూడా పీసీబీ నివేదికలో పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. హానికర పదార్థాలైన సల్ఫర్ డయాక్సయిడ్, అమ్మోనియా, బొగ్గు, ముడిఇనుము వంటి వాటిని రవాణా చేయడానికి ప్రత్యేకంగా శాటిలైట్ పోర్టును జనావాసాలకు దూరంగా ఉండేలా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వేణుగోపాల నాయుడు, గోవర్ధన్, విక్రమ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ■

*ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేలా రాజకీయ పార్టీలు ఇస్తున్న ఉచితాల హామీలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సందర్భంగా మరోసారి మార్చి 12, 2009న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కేంద్ర ఎన్నికల సంఘానికి రాసిన లేఖ (మీడియా రిలీజ్)..*

# టీవీల్లాంటి ఎరలు వేస్తున్న పార్టీలపై తక్షణం చర్య తీసుకోండి

## ... ఎన్నికలు బహిరంగ వేలంపాటలు కాకుండా నిరోధించండి

## -సీఈసీకి జయప్రకాష్ నారాయణ్ లేఖ-

ప్రజల జీవనోపాధి, నిత్యావసరాలతో సంబంధం లేకుండా కేవలం వారిని మభ్యపెట్టి ఓట్లు దండుకునే లక్ష్యంతో చేసే ఎన్నికల హామీలపై కఠిన చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఎన్. గోపాలస్వామిని కోరారు. ఆ హామీలు పూర్తిగా రాజ్యాంగవిరుద్ధమని, వీటిని అనుమతించటం ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ తన ముసాయిదా మేనిఫెస్టోలో ఇచ్చిన ఉచిత కలర్‌టీవీల హామీపై తక్షణం చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2006లో తమిళనాడులో డి.ఎం.కే ఈ హామీని ఇచ్చినప్పుడే ఎన్నికల సంఘం మౌనం వహించకుండా ఉంటే 2008 అసెంబ్లీ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి ఆ హామీని ఇచ్చేదికాదని, కాంగ్రెస్‌పై అప్పట్లో (మే 8, 2008న) లోక్‌సత్తా పార్టీ ఫిర్యాదుచేసినా ఎన్నికల సంఘం స్పందించలేదని జేపీ గుర్తుచేశారు. ఇప్పుడు టీడీపీ అదే ఎర వేసి ఓటర్లను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికైనా ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించకపోతే ఇక వచ్చే ఎన్నికల్లో ఈ తరహాలో ఉచిత స్కూటర్, ఉచిత కారు, బంగారు నెక్లెస్, చివరికి ప్రభుత్వడబ్బుతో నెలనెలా ఇంటింటికీ మద్యం బాటిళ్లు వంటి హామీల్ని అన్ని సంప్రదాయ పార్టీలూ ఇచ్చి ప్రజల్ని మోసం చేసే ప్రయత్నం చేస్తాయని హెచ్చరించారు. ఇటువంటి అవినీతి, అనైతిక ఎత్తుగడలను అడ్డుకోకపోతే ఎన్నికలు చివరికి బహిరంగ వేలంలాగా మారిపోతాయని అన్నారు. ఈ మేరకు సీఈసీకి జయప్రకాష్ నారాయణ్ రాసిన లేఖను గురువారం పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధికార ప్రతినిధులు డా॥ పి. భాస్కరరావు, కె. గీతామూర్తి మీడియాకు విడుదల చేశారు.

''పేదరికంలో ఉన్నవారిని ఆదుకోవటానికి తక్షణ సహాయంగా రాయితీలు, ఊతాలు ఇవ్వొచ్చు. ఉదాహరణకు ఉపాధిలేక ఆకలిబాధతో ఉన్నవారికి సబ్సిడీ బియ్యాన్ని అందించవచ్చు. అలాగే ఇళ్లు లేనివారికి ఇళ్లు కట్టివ్వటం, ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న రైతులకు ఉచిత విద్యుత్ వంటివి కూడా ఇవ్వొచ్చు. వాటి వెనక చిత్తశుద్ధి ఎంతుంది, వాటికి కాలపరిమితి ఉందా అనేది వేరే విషయం. కనీసం వాటి మీద చర్చ చేయవచ్చు. కానీ ఉచిత కలర్‌టీవీలు హామీకి ప్రజాప్రయోజన ప్రాతిపదిక ఏకోశానా లేదు. అలాంటి హామీనిచ్చి, అలాంటి వాటికి ప్రభుత్వ ధనాన్ని వెచ్చిస్తామని చెప్పటం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగం పట్ల పూర్తి విశ్వాసంతో, నిబద్ధతతో వ్యవహరిస్తామని ప్రమాణం చేసి, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రిజిస్టర్ అయిన రాజకీయపార్టీలు అలాంటి రాజ్యాంగవిరుద్ధ హామీలనిస్తే వాటి గుర్తింపును తక్షణం రద్దుచేయాలి" అని జేపీ తన లేఖలో పేర్కొన్నారు.

పేదరిక నిర్మూలన పేరుతో జరుగుతున్న ఉచితాలు, రాయితీల హామీల మంచిచెడులు రాజకీయ నిర్ణయంతో ముడిపడి ఉంటాయని, వాటి మీద పార్టీల వాదనలు విన్నాక అంతిమంగా ప్రజలే నిర్ణయించుకుంటారని పేర్కొన్నారు. పేదకుటుంబాలకు నెలకు రూ.1000- 2000 పథకం ఉచితానుచితాల మీద పార్టీలు తమ వాదనల్ని విన్పించి రాజకీయ నిర్ణయాన్ని ఓటరు విజ్ఞతకు వదిలేయాల్సి ఉందన్నారు.

కానీ రాజ్యాంగసంబంధ అంశాల మీద వారికి నిర్ణయాధికారం ఉండదని, రాజ్యాంగసంస్థలే చొరవ తీసుకుని ప్రజల ప్రయోజనాల్ని కాపాడాలని జేపీ స్పష్టంచేశారు. "ఒక రాష్ట్ర శాసనసభకు చట్టాలు చేసే అధికారం రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూలులోని రెండవ, మూడవ జాబితాలకు మాత్రమే పరిమితం. ప్రభుత్వం పెట్టే ఖర్చు కాని, చట్టసభ చేసే చట్టంకాని రాజ్యాంగాన్ని ఉల్లంఘించరాదు. రాష్ట్రాల బాధ్యతల పరిధిలో టీవీల పంపిణీ ఎట్టిపరిస్థితుల్లోనూ రాదు. కాబట్టి ఆ టీవీల్ని

ఇస్తామన్న హామీ రాజ్యాంగ ఉల్లంఘనే. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని 29 ఎ సెక్షన్ ప్రకారం ప్రతి పార్టీ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. ఒకవేళ పార్టీలు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే వాటిని నియంత్రించే బాధ్యత ఎన్నికల సంఘానిదే" అని జేపీ ఎన్నికల సంఘానికి వివరించారు. ర్యాంగ పరిమితులను లెక్కచేయకుండా తప్పుడు హామీ ఇస్తున్నప్పుడు రాజ్యాంగసంస్థలే తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక సాకులను చూపి చర్యలు తీసుకోకపోతే అసలు రాజ్యాంగసంస్థల ఏర్పాటు వల్ల ప్రయోజనమే దెబ్బతింటుందన్నారు. రాజ్యాంగబద్ధతను పరిరక్షించేందుకు అనేక సందర్భాలలో నిర్భయంగా వ్యవహరిస్తుండటం వల్లే సుప్రీంకోర్టుకప్రజల విశ్వాసాన్ని చూరగొందని, ఎమర్జెన్సీ కాలంలో ప్రజల ప్రాథమిక హక్కుల్ని పరిరక్షించలేనందుకు అదే సుప్రీంకోర్టు ప్రజల ఆగ్రహానికి గురైందన్నారు.

ఇన్నేళ్లూ పాలకులు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని పేదరికంలో, అవిద్యలో ఉంచటం వల్ల ప్రభుత్వమంటే 'అన్నీ ఇచ్చేది' అనే భావన చాలామంది ప్రజల్లో ఉందని, ఇలాంటప్పుడు రాజ్యాంగ సంస్థలే ముందుకొచ్చి మంచి, చెడుల మధ్య తేడాని వివరించాలని అన్నారు. **అంతిమంగా ప్రజలు విజ్ఞతే స్వేచ్ఛకు గ్యారంటీ కానీ కేవలం రాజకీయపరమైన, విధానపరమైన అంశాలను మాత్రమే ప్రజల నిర్ణయానికి వదలాలన్నారు. అలాకాక ఒక రాష్ట్రాన్ని స్వతంత్రదేశంగా చేస్తామని, లేదా మరోదేశంలో విలీనం చేస్తామని ఏ పార్టీఅయినా హామీ ఇస్తే, అది రాజ్యాంగ ఉల్లంఘనేనన్నారు. ఆ అంశాన్ని నిర్ణయించాల్సింది ఎన్నికల ద్వారా కాదు, రాజ్యాంగసంస్థల జోక్యం ద్వారా మాత్రమే. కాబట్టి అన్ని అంశాలనూ ఎన్నికలలో ప్రజలే నిర్ణయిస్తారనుకుంటే అసలు రాజ్యాంగమే అక్కర్లేదు'' అని జేపీ పేర్కొన్నారు. రాజ్యాంగవిరుద్ధమైన ఎన్నికల హామీలపై చర్యలకు ప్రస్తుతానికి పార్లమెంటులో ఎలాంటి చట్టం లేదని, ఆర్టికల్ 324కింద ఎన్నికల సంఘమే ఈ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉందని జేపీ స్పష్టంచేశారు.** ఎన్నికల సంఘం ఉదాసీనతను వీడి... ఓటర్లను రకరకాలుగా ప్రలోభపెడుతున్న పార్టీ లేదా పార్టీల మీద తక్షణం చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించాలని జయప్రకాష్ నారాయణ్ సీఈసీని కోరారు." ■

## గత ఎన్నికల్లో రూ.11.50 కోట్లు ఖర్చు పెట్టినట్టు అంగీకరించిన ఏపీ స్పీకర్

2014 ఎన్నికల్లో రూ. 11.50 కోట్లు ఖర్చు పెట్టినట్టు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్, సత్తెనపల్లి శాసనసభ్యుడు (తెదేపా) కోడెల శివప్రసాదరావు ఒప్పుకున్నారు. ఈసీ నిబంధనల ప్రకారం కేవలం రూ. 28లక్షలే అసెంబ్లీ స్థానానికి ఖర్చు పెట్టాల్సి ఉండగా, అఫిడవిట్‌లో కోడెల ప్రకటించిన ఆస్తులు కూడా రూ. 5.29కోట్లు మాత్రమే ఉండటం విశేషం. ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'నేను మొదట రాజకీయాల్లోకి వచ్చినప్పుడు 1983లో ఎన్నికల్లో 30వేలు ఖర్చయింది. గ్రామాలు, ప్రజల నుంచి చందాలు వచ్చాయి. కానీ మొన్న ఎన్నికల్లో రూ. 11.50 కోట్లు ఖర్చు పెట్టాను. ఈ విధంగా డబ్బు ఖర్చు చేయాలంటే అవినీతి చేసేవారు, ఆస్తులు అమ్ముకునేవారు, రెండూ కలిపి చేసేవారు ఉంటారు. ఎంపీ అభ్యర్థి దగ్గర తీసుకునేవారూ ఉంటారు. రాజకీయాల్లో డబ్బుకు ప్రాధాన్యత పెరిగింది. ఇది ఆరోగ్యకర పరిణామం కాదు. ప్రజలు కూడా ఆలోచించాలి. ప్రజాప్రతినిధులు సంపాదించారు కాబట్టి వారి దగ్గర తీసుకోవటం సరైనదేనని ప్రజలు అనుకుంటున్నారు. మా దగ్గర డబ్బులు తీసుకున్నారు కాబట్టి సంపాదించుకోవాలని ప్రతినిధులు అనుకుంటున్నారు" అన్నారు. ■

## ఎన్నికల్లో ఉచితాలపై నియంత్రణకు కసరత్తు

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, ఇతర తాయిలాలు ఇచ్చే పద్ధతికి చెక్ పెట్టేందుకు అవసరమైన పరిష్కార మార్గాలను పార్లమెంటరీ కమిటీ పరిశీలిస్తోంది. "ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అధ్యయనం చేస్తున్నాం. దీనిపై చర్చలు జరిపేందుకు కమిటీ మూడు రాష్ట్రాలకు వెళ్తోంది. త్వరలో అన్ని రాష్ట్రాల్లోనూ పర్యటిస్తాం" అని కమిటీ ఛైర్మన్ ఈఎం నచియప్పన్ జూన్ 2016లో చెప్పారు. అలాగే నియమావళిని ఎన్నికల షెడ్యూల్ ప్రకటన సమయం నుంచి కాకుండా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి అమలుచేయాలన్న తమ ప్రతిపాదనపై ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. ■

# ఫెడరల్ శక్తుల అసలైన యుద్ధం!

- టంకశాల అశోక్

దేశంలోని ఫెడరల్ శక్తులతో ఒక సమస్య ఉన్నది. అవి కాంగ్రెస్, బీజేపీ అనే సెంట్రలిస్టు శక్తులతో ఎంతగా తలపడుతున్నాయో, తమపై తాము చేసుకోవలసిన ఒక యుద్ధాన్ని అంతగా చేయడం లేదు. దేశంలో ఫెడరల్ ధోరణులు బలపడిన గత 35-40 సంవత్సరాల చరిత్రను గమనిస్తే, ఈ శక్తుల విజయాలకు, పరాజయాలకు కూడా మూలాలు ఈ రెండు విధాలైన స్థితిగతులలో కన్పిస్తాయి. అది ఏ విధంగానో చూసే ముందు కొన్ని వివరణలు అవసరం.

1. ఫెడరలిస్టు శక్తులని మనం అంటున్నది ప్రాంతీయ పార్టీల గురించి మాత్రమే కాదు. బలహీన వర్గాల పార్టీలు కూడా ఇందులోకి వస్తాయి. ఎందుకంటే, ఇరువురికీ ప్రాతిపదికలు వేరైనా లక్ష్యాలు మాత్రం తమ హక్కుల సాధన, అస్తిత్వ పరిరక్షణ. సెంట్రలిజం వారికి ఉమ్మడి శత్రువు. 2. కాంగ్రెస్‌కు స్వాతంత్ర్యోద్యమ కాలంలో, రాజ్యాంగ రచనలో ఫెడరలిస్టు లక్ష్యాలు ఉన్నప్పటికీ క్రమంగా సెంట్రలిస్టుగా మారింది. బీజేపీ లక్షణమూ అదే. ఈ రెండు పార్టీలు తప్పనిసరి పరిస్థితులలో ఫెడరల్ హక్కుల పరిరక్షణ గురించి మాట్లాడినా, వాటి మౌలిక స్వభావం మాత్రం సెంట్రలిజం. ఫెడరల్ శక్తులతో వారి పొత్తులు ఎత్తుగడ మాత్రమే. 3. ఫెడరలిస్టులు తమపై తాము చేసుకోవలసిన యుద్ధం అంటే ఏమిటి? వారు సెంట్రలిస్టులపై రాజకీయ అధికారం, ఆర్థికాధికారం కోసం పోరాడుతున్నారు. కానీ తమ ప్రజలకు ఈ ఫెడరల్ హక్కులు మాత్రమే చాలవు. వారికి ఈ రెండు హక్కుల వికేంద్రీకరణ కావాలి. కాంగ్రెస్, బీజేపీలది సెంట్రలిజం కాగా వారిపై పోరాడి తెచ్చుకున్న హక్కులు ఫెడరలిస్టు పార్టీల నాయకుల వద్ద సబ్-సెంట్రలిజంగా మారి ఆగకూడదు. అదేవిధంగా సెంట్రలిస్టు పార్టీల అభివృద్ధి, పరిపాలనా నమూనాలు తిరస్కరణకు గురవుతున్న స్థితిలో, ఫెడరలిస్టు శక్తులు ప్రత్యామ్నాయ నమూనాలను ప్రజలకు అందించాలి. వీరు అటువంటి కృషి చేయనందువల్లనే గత 35-40 సంవత్సరాలలో ఒకసారి గెలిచి మరొకసారి ఓడుతున్నారు. కనుక, సెంట్రలిస్టు పార్టీల నమూనాల నుంచి బయటపడటమే వీరు తమపై తాము చేసుకోవలసిన యుద్ధం. అందులో గెలిస్తే వారికిక ఓటమి అన్నది ఉండదు. కనీసం గత 35 సంవత్సరాల రికార్డు వలె ఇంత తరచుగా ఓడటమన్నది ఉండదు.

ఇంతవరకు జరుగుతూ వచ్చిందేమిటో మనకు తెలుసు. కాంగ్రెస్ పార్టీ ఫెడరలిజమని మాట్లాడుతూనే సెంట్రలిస్టు విధానాలను అనుసరించటం వల్ల ప్రాంతీయ శక్తులు, బలహీనవర్గాల పార్టీలు ముందుకొచ్చాయి. మరొక జాతీయస్థాయి పార్టీ బీజేపీ స్వభావం కూడా అందుకు భిన్నమైంది కాదు. కనుక, దేశంలో ఫెడరల్ ధోరణి అన్నది మౌలికంగా, క్షేత్రస్థాయిలో ఏర్పడిపోయింది. ఈ భావనలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు తమ స్వీయబలాలు, లోపాల కారణంగా ఒకసారి గెలిచి ఒకసారి ఓడుతూండవచ్చు. దాని అర్థం ప్రజల భావనలు మారటం కాదు. అయితే ఈ క్రమం ఎట్లా జరుగుతూ వచ్చింది? అటువంటి అనుభవాలతో ఫెడరల్ శక్తులు తమ లోటుపాట్లపై తాము సాగించవలసిన యుద్ధం ఎటువంటిది? తద్వారా ఇంతకాలం ఒడిదుడుకులకు గురైనట్టుగాక దీర్ఘకాలం పాటు స్థిరపడటం ఏ విధంగా? అన్నవి ఆలోచించవలసిన విషయాలు. అది జరిగినప్పుడు మాత్రమే ఫెడరలిస్టు శక్తులు నిజమైన విజయం సాధించినట్లవుతుంది. పలు మార్పులకు గురవుతున్న ఫెడరల్ డార్వినిజం, ఇన్నేళ్ల ఢక్కామొక్కీల దశను దాటి ఒక పరిపూర్ణమయిన, స్థిరమయిన రూపానికి వస్తుంది. నిజానికి సాధారణ ప్రజలు తమ వంతు కృషిగా, ఇందుకు అవసరమైన పాఠాలను ఫెడరల్ శక్తులకు చెబుతూనే ఉన్నారు. వాటిని ఇంతకాలం గ్రహించలేకపోయిన ఫెడరల్ పార్టీల నాయకత్వాలు ఇకనుంచైనా ఆ పనిచేయాలి.

ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికలలోనూ సెంట్రలిస్టు పార్టీలతో పాటు ఫెడరలిస్టు పార్టీలు తలపడ్డాయి. వీటిలో ఎవరు గెలిచి ఎవరు ఓడారన్నది కాదు ఇక్కడ చర్చ. జయాపజయాలు రెండువైపులా ఉన్నాయన్నది గుర్తించవలసిన విషయం. అదేవిధంగా మరొక మూడేళ్లలో జరగనున్న 2019 సార్వత్రిక ఎన్నికలతోపాటు ఈలోగా కూడా జరిగే పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో సెంట్రలిస్టులు, ఫెడరలిస్టులు రంగంలో ఉంటారు. కానీ అంతిమ విశ్లేషణలో చరిత్ర గత 35 సంవత్సరాల కన్నా భిన్నంగా ఉండగల అవకాశం లేదు. జయాపజయాలు రెండు వైపులా ఉంటాయి. కానీ బహుశా ఒక తేడా. కనీసం ఒక మేరకు, సెంట్రలిస్టు పార్టీలు రెండింటి విషయంలో చోటుచేసుకోవచ్చు. 1952 నాటి మొదటి ఎన్నికల నుంచి 25-30 సంవత్సరాల పాటు వెలుగొందిన ఏకైక

సెంట్రలిస్టు పార్టీ స్థానంలోకి ఇప్పుడు మరొక సెంట్రలిస్టు పార్టీ క్రమంగా వచ్చి చేరుతున్నది. ఈ క్రమం 2019తో ముగియదుగాని మరింత ముందుకుపోవచ్చు. అది జరిగితే ఫెడరలిస్టుల గత 35 ఏళ్ల పోరాటంలో ఎక్కువకాలంపాటు ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ కాగా ఇక నుంచి ప్రధాన ప్రత్యర్థి బీజేపీ అవుతుంది. రెండవ ప్రత్యర్థిగానైనా కాంగ్రెస్ నిలిచే ఉంటుంది. అయితే ఈ స్థితిని ఎదుర్కొని తన ఆధిపత్యాన్ని విస్తరించుకునేందుకు ఇంతకాలం కాంగ్రెస్ అనుసరించిన పద్ధతులనే బీజేపీ కూడా పాటిస్తుంది తప్ప, సెంట్రలిస్టు విధానాలు మౌలికంగా మార్చుకునే అవకాశం లేదు. ఆ విధంగా ఫెడరలిస్టులకు పాత సమస్య ఒక కొత్త ప్రత్యర్థి రూపంలో కొనసాగుతుంది. ఫెడరలిస్టులను దారికి తెచ్చుకునేందుకు బీజేపీ కూడా సామ-దాన-భేద-దండోపాయాలను కాంగ్రెస్ వలెనే ప్రయోగిస్తుంది. ఈ మహత్తర దేశపు మహా వైవిధ్యతలో నిక్షిప్తమై ఉన్న ఫెడరలిస్టు ధర్మాలను మాత్రం గౌరవించదు.

అటువంటి ధర్మాలను నిలిపే ధర్మయుద్ధం చేయవలసిన బాధ్యత ఫెడరలిస్టు శక్తులదే. స్వీయ అస్తిత్వం, స్వీయ ఆకాంక్షలు అజెండాగా గల ప్రాంతీయ పార్టీలు, బలహీనవర్గాల పార్టీలు దేశంలోని అత్యధిక రాష్ట్రాలలో ఉన్నాయి. పైన అనుకున్నట్లు ఇవన్నీ కలిపి ఫెడరల్ శక్తులవుతున్నాయి. అయితే వీటి వ్యవహారణ గురించి కూడా పైన ఒక మాట అనుకున్నాం. అది, ఆ శక్తులు తమ లోటుపాట్లపై తాము యుద్ధం చేయవలసి ఉండటం. సూటిగా చెప్పాలంటే ఈ పార్టీలు తమ హక్కుల గురించి మాట్లాడి ప్రజలను ఉత్తేజపరచి గెలుస్తున్నాయిగానీ, ఆ విధంగా సాధించిన హక్కుల ఫలితాలు తమ ప్రజలందరికీ చేరగల ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాలను రూపొందించటం లేదు. దేశమంతటా గల వివిధ ఫెడరల్ పార్టీలు ఇంతవరకు అధికారం నెరపినప్పుడు సాగించిన పరిపాలనలను పరిశీలించినట్లయితే సంతృప్తిని కలిగించేది మరీ ఎక్కువేమీ లేదు. సెంట్రలిస్టు పార్టీలతో, లేదా ఇతర ప్రాంతీయ ప్రత్యర్థులతో పోటీపడి కాంపిటీటివ్ పాప్యులిజం కొంత కాంపిటీటివ్ వెల్ఫేరిజం కొంత అనుసరించటం ఒక వైపు కనిపిస్తుంది. అధికార ప్రయోజనం కోసం చేసే పని అది. మరొకవైపు, సెంట్రలిస్టు పార్టీలు చేయని విధంగా స్థానిక అభివృద్ధి పైన, స్థానిక తరగతుల సాధికారతపైన దృష్టి పెట్టటం కనిపిస్తుంది. దీనిని ఫెడరలిస్టులు అధికారానికి రావడం వల్ల కలిగిన అదనపు మేలుగా పరిగణించాలి. ప్రాంతీయ అస్తిత్వాలకు, బలహీన వర్గాల అస్తిత్వాలకు గతంలో లేని గుర్తింపు, గౌరవం లభించటం మరొక ప్రయోజనం. స్థానిక వనరులను స్థానిక ప్రయోజనాలకు ఉపయోగించే దృష్టి తగినంత లేకపోయినా ఒక మేర కలుగుతుండటం ఇంకొక మేలు. అయితే ఇదంతా ఒక పరిమితిలో కనిపించే మార్పు కావటం, అనేక విషయాలలో ఫెడరల్ శక్తులకు తమవైన ప్రత్యామ్నాయ నమూనాలు లేకపోవటమన్నది సమస్యగా ఉన్నది. వారి పరిపాలనలలో సెంట్రలిస్టు పార్టీల లక్షణాలే గణనీయంగా ఉంటున్నాయి. సామాజికంగా సమతులన అభివృద్ధి, అన్ని ప్రాంతాల అభివృద్ధి, అన్ని రంగాల అభివృద్ధి, బలహీన కులాలను పట్టించుకోవడం, తమ కులాలలో గల పేదవర్గాలపై శ్రద్ధ చూపటం, పరిపాలనలో నైతిక విలువలు, వికేంద్రీకరణ మొదలైన వాటి అన్నింటితో కూడిన ప్రత్యామ్నాయ నమూనాలను రూపొందించి అమలుపరచటం లేదు. కనుక ఫెడరలిస్టు లక్ష్యాలు సరిగా నెరవేరక, ఆ ఫలితాలు ఒక పరిధిలో ఆగుతున్నాయి. గమనించదగ్గదేమంటే, సరిగా ఈ పరిస్థితుల కారణంగానే, ఏ ఓటర్లు అయితే ఫెడరలిస్టు శక్తులను పూర్తిగా, శాశ్వతంగా బలపరచాలో ఆ ప్రజల ఓట్లకు చలనశీలత ఏర్పడుతున్నది. అవి తరచు సెంట్రలిస్టు పార్టీలవైపు కదిలిపోతున్నాయి. నిజానికి ఈ ఓట్లు అధికారంలోని ఒక ఫెడరల్ పార్టీ నుంచి మరొక ఫెడరల్ పార్టీ వైపు కదిలిపోయినా అది మొదటి ఫెడరల్ పార్టీ నమూనా వైఫల్యమే. అంతిమంగా ఫెడరలిజం తన లక్ష్యాలను సాధించకపోవటమే.

70 సంవత్సరాల స్వాతంత్ర్యం, 35 సంవత్సరాల ఫెడరలిస్టు సంఘర్షణ తర్వాత, దేశానికి అటువంటి ఫెడరల్ నమూనా చాలా అవసరమైన దశ వచ్చింది.

(నమస్తే తెలంగాణ సౌజన్యంతో)

**ఏ ఓటర్లు అయితే ఫెడరలిస్టు శక్తులను పూర్తిగా, శాశ్వతంగా బలపరచాలో ఆ ప్రజల ఓట్లకు చలనశీలత ఏర్పడుతున్నది. అవి తరచు సెంట్రలిస్టు పార్టీలవైపు కదిలిపోతున్నాయి. నిజానికి ఈ ఓట్లు అధికారంలోని ఒక ఫెడరల్ పార్టీ నుంచి మరొక ఫెడరల్ పార్టీ వైపు కదిలిపోయినా అది మొదటి ఫెడరల్ పార్టీ నమూనా వైఫల్యమే. అంతిమంగా ఫెడరలిజం తన లక్ష్యాలను సాధించకపోవటమే.**


# ఎవరో ఒకరు ఈ మాటలు చెప్పాలి

-ఎ.అన్నపూర్ణ,
కాలిఫోర్నియా

పరిస్థితులు అనుకూలించేంత వరకు లోక్‌సత్తా పార్టీ ఎన్నికల్లో పోటీచేయదు.. అని పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించగానే చాలామంది ఆవేదన వ్యక్తం చేసినా కొంతమంది అనుచిత విమర్శలు కూడా చేశారు. కొందరు మీడియా వ్యాఖ్యాతలతోపాటు పార్టీలో పనిచేసిన వారిలో కొంతమంది సైతం 'జేపీ వైఫల్యం' అంటూ వాదోపవాదాలకు దిగారు. (లోక్‌సత్తా పార్టీ ఎన్నికల హాలిడేను ప్రకటించిన మార్చి 22, 2016 నుంచి ఇప్పటి వరకూ ఏ పార్టీ, ఏ సంస్థ ఏ పని, ఎంత సీరియస్‌గా చేసిందో నిజాయతీగా లెక్కతీస్తే, లోక్‌సత్తా తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశంలోనే నెంబర్‌వన్ పార్టీగా నిలుస్తుంది. ఎన్నికల్లో గెలవటంలో మిగిలినవాళ్లు హీరోలయితే, అధికారం లేకపోయినా ఎన్నికల లక్ష్యాల్ని సాధించేందుకు కృషి చేస్తున్న నిజమైన హీరో జేపీ. లోక్‌సత్తాలాంటి మౌలిక సంస్కరణల ప్రయత్నం కొన్ని అభివృద్ధి చెందిన దేశాలలో గతంలో జరిగిందిగానీ లోక్‌సత్తా చేసిన స్థాయిలో ఎక్కడా జరగలేదు. ఐరోపాకంటే సంక్లిష్ట సువిశాలమైన భారత్‌లో సంస్కరణలకు నాంది పలకటం వల్ల లోక్‌సత్తా స్కేల్ ఆఫ్ ఛేంజ్ (మార్పు స్థాయి) ప్రపంచంలోనే సమున్నత స్థానంలో నిలుస్తుంది)

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ స్థాపించడానికి ముందు నుంచే జేపీ గారి గురించి నాకు తెలుసు. మంచి నాయకత్వం, భవిష్యత్తు పట్ల ఆశ ఉన్నవారు, సంస్థ ద్వారా జేపీ సాధించిన విజయాల గురించి తెలిసినవారు లోక్‌సత్తా ఎన్నికల హాలిడేని ఆయన వైఫల్యంగా చూడరు. జేపీ అసాధారణ కృషిని తాత్కాలిక జయాపజయాల చట్రంలో చూడకూడదని లోక్‌సత్తా విప్లవాత్మక ఆలోచనాధోరణి ఉన్న వారికి స్పష్టంగా తెలుసు.

జేపీ తూర్పు గోదావరి జిల్లాకి కలెక్టర్‌గా పనిచేసినప్పుడు ఆయన వ్యక్తిత్వం, ఉదారగుణం, కార్యదీక్షత, సేవాభావం మాకు బాగా తెలుసు. ఎందుకంటే మాది కాకినాడ కనుక. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ పత్రికలు చదవటం అలవాటుగా ఉన్నందువల్ల వార్తాపత్రికల్లో వారు రాసే వ్యాసాలన్నిటినీ శ్రద్ధగా చదివాను. ఆ తర్వాత హైదరాబాద్ వచ్చాం. పిల్లల చదువులు, ఇంటి బాధ్యతలూ తీరాక లోక్‌సత్తా ఉద్యమసంస్థలో పనిచేయాలని ఆలోచన వచ్చింది. నా భర్తగారితో చెప్పాను. తప్పకుండా చేయమన్నారు. వెంటనే సభ్యత్వం తీసుకున్నాను. అప్పుడే సంస్థ ద్వారా జేపీ సాధిస్తున్న విజయాలను ప్రత్యక్షంగా చూశాను. కొన్ని ఉద్యమాలలో పాల్గొనే మహత్తరమైన అవకాశం నాకు దక్కింది. అది నా జీవితంలో ఒక మంచి మలుపు. ఆ తర్వాత డా॥ జేపీ లోక్‌సత్తా రాజకీయ పార్టీని స్థాపించిన ఆ రోజు మరచిపోలేనిది. దాదాపు సంస్థలో ఉన్నవారంతా సభ్యులు, కార్యకర్తలుగా చేరారు. మా అందరికీ రాజకీయ ప్రస్థానం ప్రారంభమయినది. మాకు




రాజకీయాలు కొత్త. అనుభవం అనేది ఒక రంగంలోకి ప్రవేశించిన తర్వాతనే కద వచ్చేది!

మా అందరిలోనూ ఆనందం చెప్పలేనంత ఉత్సాహం పరవళ్లు తొక్కింది. మా ఆశయాలకు వేదిక లోక్‌సత్తా. మా నాయకుడు గొప్ప ఆశయాలు, అవగాహన, ఆచరణ మూర్తీభవించిన గొప్ప రాజకీయ, సమాజ సంస్కర్త. పాఠ్యపుస్తకాలలో కొందరు మహామహుల గురించి చదివాను. ఈరోజు ప్రత్యక్షంగా అలాంటి వ్యక్తిని చూడటమే కాదు, ఆయనతో కలిసి పనిచేయగల గొప్ప అవకాశం! ఈ అనుభూతి మాటల్లో చెప్పలేనిది. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రక్రియ ప్రారంభమైంది. స్నేహితులు, బంధువులు, పరిచయస్తులు ఇలా ఇంటింటికీ వెళ్లి ప్రజల్ని సమీకరించే ప్రయత్నం మొదలుపెట్టాం. అందరూ ప్రోత్సహించారు. అభినందించారు. వారి సహాయసహకారాలు అందించడానికి ముందుకు వచ్చారు. రాలేనివారు పరోక్షంగా పనిచేస్తాం అన్నారు. అంతవరకూ రాజకీయాల పట్ల విముఖతను కలిగివున్నవారు, ఓటు లేనివారు, వేయని వారు వారి అభిప్రాయాన్ని మార్చుకుని ఓటు వేయకపోవడం ఎంత పొరపాటో తెలుసుకోగలిగామన్నారు. లోక్‌సత్తా పార్టీ నేత జేపీ మహిళలను ఎంతగా గౌరవిస్తారో తెలిసినవారూ మా వెంట పనిచేయడానికి కార్యకర్తలుగా స్వచ్ఛందంగా సిద్ధమయ్యారు. మెంబర్‌షిప్ చేయడంలో, మీటింగ్‌లకు హాజరవడంలో, నిధులు సేకరించడంలో ఎంతో సహకరించారు. మంచి నాయకత్వం పట్ల ప్రజల్లో ఆదరణ అంతర్గతంగా దాగివుందని మాకు తెలియవచ్చింది. కాలం ఎంత త్వరగా గడిచిపోయిందో మాకు తెలియలేదు. కొత్తవారి పరిచయాలు, ప్రముఖ వ్యక్తుల ఆదరణ, సామాన్య ప్రజల అంతరంగం, వారి సమస్యలు ఇలా మాకు ఎన్నో అనుభవాలను పంచింది. అధికారులు, యువత, మహిళలు, చదువులేకపోయినా ఏదోకరకంగా సహాయపడాలనే తపన ఉన్నవారు, జేపీగారి వల్ల ఉపాధి పొందినవారు లెక్కలేనంతమంది మాలో ఉత్సాహం నింపారు. ఉద్యోగాలు

చేసేవారు సైతం వారాంతంలో విశ్రాంతిని త్యాగం చేసి పనిచేశారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌వారు ఎంతగానో సహకరించారు. ఉన్నతస్థానాల్లో ఉన్నవారు ఉద్యోగాలకు రాజీనామా చేసి పార్టీలోకి వస్తాం అన్నారు. వారిలో ఒక ప్రొఫెసర్ ఎంఎల్‌సీ అభ్యర్థిగా పోటీచేస్తానంటే జేపీ సహకారం అందించారు. జేపీ ఆదేశానుసారం పట్టభద్రులకు డిగ్రీ సర్టిఫికెట్లు తెప్పించి మరీ ఓట్లు వేయించాం. ఐఏఎస్ అధికారి నుంచి సామాన్యుల వరకూ ఓటు వేయడానికి ముందుకొచ్చారు. అంతవరకూ తటస్థంగా ఉండిపోయినవారిలో చైతన్యం కలిగించాం. నేనూ నా భర్తా 150మంది చేత ఓట్లు వేయించాం. అప్పటి దాకా ఎంఎల్‌సీ ఎన్నికల గురించి పట్టించుకోని వారిలో అవగాహన కల్పించాం. వారి హక్కుల గురించి తెలియచేశాం. పార్టీలో మరికొందరు కూడా తమ వంతు పనిచేశారు. జేపీ కారణంగా ప్రయోజనం పొందిన ఆ ప్రొఫెసర్ ఆ తర్వాత ఏం చేశారు? 2014 ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి జేపీకి వ్యతిరేకంగా పోటీ చేశారు. చిన్నచిన్న అభిప్రాయ భేదాల కారణంగా ఒక పెద్ద లక్ష్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించటాన్ని ఏమంటారో విజ్ఞులే చెప్పాలి. ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఆయనకు సహకరించినా జేపీ ఏనాడూ ఆ విషయాన్ని బహిరంగంగా చెప్పలేదు. బాధతో నేనే ఇప్పుడు చెబుతున్నాను. ఇలాంటి సందర్భాలు అనేకం ఉన్నాయి. జేపీ వల్ల ఉపకారం పొంది నమ్మకద్రోహం చేసినవారు చాలామంది ఉన్నారు.

అలాగే నా కంటే ముందు ఒక యువకుడు లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో చేరాడు. జేపీగారి ప్రోత్సాహంతో ఎదిగాడు. ఆయన పట్ల ఆ యువకునికున్న వినయవిధేయతలు, గౌరవం, అభిమానం అపారం. జేపీ కోసం ఏమైనా చేస్తాను అన్నంత ఆవేశం ఉండేది. జేపీకి సేవారంగంలో అత్యున్నత పురస్కారం, గౌరవం లభించేంతవరకూ విశ్రమించను అంటుండేవాడు. అంతటి ప్రేమాభిమానాలుండేవి. ఈ మాటలన్నీ నాతో చెప్పి పంచుకున్నాడు. హైదరాబాద్ నగరంలో ఎక్కడ అవినీతి పనులు, అక్రమాలు, అన్యాయాలు జరిగాయో అక్కడికి ఇద్దరం కలిసివెళ్లి సంబంధిత అధికారులను, వ్యక్తులను కలిసి రిపోర్ట్ తెచ్చి జేపీగారికి ఇచ్చేవాళ్లం. అంతటివాడు లోక్‌సత్తా ఎలక్షన్ హాలిడే ప్రకటన వెలువడ్డాక, సాక్షి పేపర్‌కి ఒక పెద్ద ఉత్తరం రాశాడు. అదేమిటంటే, 'పవన్ కళ్యాణ్ జేపీగార్ని చూసి గుణపాఠం నేర్చుకోవాలని!'.

సోదరా! నువ్వు పవన్ కళ్యాణ్ గ్లామర్‌కి, జేపీ కృషికి తేడా తెలియని పసివాడిగా ఉండటం ఆశ్చర్యంగా ఉంది. డైలాగులు చెప్పటానికి, నిజజీవితంలో ఆచరించటానికి తేడా ఏమిటో మల్కాజిగిరిలో చూడలేదా?

జేపీకి పుస్తక పఠనం అంటే ప్రీతి. ప్రపంచంలో అత్యుత్తమ నాయకులందరికీ ఉండే ఉమ్మడి లక్షణాల్లో ఇదొకటి. దీన్ని కూడా హేళన చేసేంతటివాడివయ్యావా సోదరా? నువ్వేనా లోక్‌సత్తాలో పనిచేసింది? లోక్‌సత్తా గురించి ఇదేనా నీకు అర్థమైంది? ఏదో చిన్న మనస్తాపం కలిగివుండవచ్చు. మానవమాత్రులకి సహజం. దాన్ని సరిచేసుకోవడం విజ్ఞత. మనం పనిచేస్తున్నది చుట్టూవున్న సమాజం కోసం, దేశం కోసం, మన దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం తప్ప ఇతర పార్టీల్లోలా వ్యక్తిగతంగా జేపీ కోసం కాదన్న వాస్తవాన్ని గుర్తుపెట్టుకుంటే మనకు ఇలాంటి అపోహలు, అపార్థాలు ఉండనే వుండవు. లోక్‌సత్తా జేపీ సొంత ఆస్తా లేక ఈ దేశాన్ని బాగుచేసే బాధ్యత జేపీది మాత్రమేనా?

మనం అతి సామాన్యులం. ఎక్కడో అనామకంగా ఉన్నవాళ్లం. నా మట్టుకు నాకు, ఇంట్లో కూర్చుని ఎప్పుడూ పుస్తకాలు చదువుకుంటూ ఆలోచన వచ్చినప్పుడు కథలు, కవితలు, వ్యాసాలు రాసుకుంటూ ఉండేదాన్ని. మిమ్మల్ని ఎక్కడో చూశానండీ అని, మీరు లోక్‌సత్తా అన్నపూర్ణ మేడమ్ అని మరొకరు, లోక్‌సత్తా నుంచి వచ్చార్ట అపాయింట్‌మెంట్ అడుగుతున్నారు అంటూ ప్రభుత్వాధికారుల సెక్రటరీ చెప్పగానే "వెంటనే పంపించు" అనే గౌరవం మనకు జేపీ భావాలు, జేపీ కృషి నుంచి వచ్చినవి కావా?

చేస్తున్నదంతా ఈదేశం కోసమే అయినా, 'నన్ను నమ్మి అడుగడుగునా వెంటనడిచి వీలైనంత సహకారం అందించిన వారందరికీ బాధ కలిగించానేమో. వీళ్ల గురించి ఏం చేయాలి' అని మథనపడే సున్నితమనస్కులు జేపీ. తానేదో కోల్పోయానని విచారించే స్వార్థం ఏనాడూ ఆయనలో కనిపించదు. ప్రజలు 'మేము దురదృష్టవంతులం. ఆయనను గెలిపించుకోలేకపోయిన అసమర్థులం' అని బాధపడటం నాకు తెలుసు. ప్రజల మంచి కోరిన వ్యక్తిగా ఒక గొప్పప్రయత్నం జరుగుతోంది. అనుకున్నది వెంటనే జరగకపోవచ్చు. అంతమాత్రాన వివేకం కోల్పోవడం సరికాదు. జేపీకి అధికారమో, పదవో కావాలంటే వేచివుండనక్కర్లేదు. పదవే ఆయన్ను వెతుక్కుంటూ వచ్చేది. అంతటి అవకాశాలు, అర్హతలు ఆయనకున్నాయి. ఆ అవకాశాలను తృణప్రాయంగా నిరాకరించి అలాంటి అధికారంకన్నా మార్పు ముఖ్యమని భావించిన నిరాడంబరుడు, నిజమైన ప్రజాస్వామ్య నాయకుడు జేపీ.

అలాంటి వ్యక్తికి తోడుగా వెన్నంటివున్న నువ్వు, లోక్‌సత్తా ఉద్యమం సాధించిన కొన్ని విజయాలలో భాగస్వామిగా ఉన్న నువ్వు ఆ ఉత్తరం ఎలా రాయగలిగావు సోదరా? నీకా ఊహ కలగడమే అధర్మం. నువ్వు బాగా తెలిసిన మనిషివి కాబట్టి చెప్పాలనిపించింది.

సోదరా, నీ ఉత్తరాన్ని జేపీ చదివారో లేదో నాకు తెలియదు. చదివినా ఆయన పట్టించుకోకపోవచ్చు. కానీ నేను ఊరుకోలేకపోయాను. తప్పటడుగులు వేస్తే మందలించేటంత పరిచయం మనది. అందుకే కొన్ని అంశాలను ఇలా దృష్టికి తెస్తున్నాను. మనలాంటి అందరితోనూ పంచుకుంటున్నాను. ■

# జేపీ నిర్ణయం సరైనది, అనుసరిస్తాం

ఇరవయ్యేళ్ల క్రితం ఉద్యమంగా ప్రారంభమై 'కొత్త తరానికి కొత్త రాజకీయాలు' అనే నినాదంతో పదేళ్ల క్రితం రాజకీయ పార్టీగా అవతరించిన లోక్‌సత్తా.. పరిస్థితులు అనుకూలించేంత వరకూ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయబోదంటూ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీసుకున్న నిర్ణయాన్ని తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్టు పార్టీ మహేశ్వరం ఇంఛార్జి తోడేటి ప్రసాద్ అన్నారు. ఎన్నికలు సైతం వ్యాపారమయంగా మారిన ప్రస్తుత పరిస్థితులలో ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం చేసే లోక్‌సత్తా పోటీ చేసే పరిస్థితులు ఇంకా ఏర్పడలేదని, ప్రజలకు తమ ప్రయోజనమేదో తమకే అర్థంకాని పరిస్థితిని సాంప్రదాయ పార్టీలు కల్పించాయని అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసే పరిస్థితులు కల్పిస్తే లోక్‌సత్తా ఇప్పటికే ఎన్నో విజయాల్ని అందుకుని ఉండేదని, అయితే నేటి పార్టీలు తమ స్వార్థం కోసం ఓటర్లతో ఆడుకుంటున్నాయని, అందుకే లోక్‌సత్తాలాంటి నిజమైన జన రాజకీయ పార్టీ ఎన్నికల బరిలో చిన్నబోవాల్సిన దుస్థితి ఎదురవుతోందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మౌలిక మార్పు రాకుండా ఎన్నిసార్లు ఎన్నికల్లో పోటీచేసినా ఆశించిన ఫలితం రాదని స్పష్టంకావటంతో జేపీ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారని ప్రసాద్ అన్నారు. ఎన్నికలలో పోటీ చేయనంత మాత్రాన, అధికారం లేనంత మాత్రాన తాము ప్రజాజీవితానికి దూరం కాబోమని, ఇరవయ్యేళ్లుగా చేస్తున్నట్టే అవినీతికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడతామని, వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ మంచి విద్య, ఆరోగ్యం అందించేందుకు, అధికారాన్ని వికేంద్రీకరించి జనం చేతికి ఇచ్చేందుకు కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడతామన్నారు. పార్టీని ఆదరించిన ప్రజలకు కృతజ్ఞత తెలుపుతూ, ఇకపై కూడా తమ సంస్కరణోద్యమానికి ఇదే తరహా అభిమానాన్ని కొనసాగించాలని కోరారు. గతంలో వలెనే పాలకులు, ఇతర నేతలు, అధికారులు, మీడియా లోక్‌సత్తా పోరాటాలకు అండగా నిలవాలని ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ■


## మోదీ వచ్చాక భారత్‌కు సంతోషం తగ్గిందట!

మోదీ వచ్చాక అచ్చేదిన్ ఏమోగానీ భారత్‌కు గత ఏడాది కాలంలో సంతోషం తగ్గిందని ప్రపంచ సంతోష నివేదిక-2016 తెలిపింది. సంతోషం స్థాయి అత్యధికంగా తగ్గిపోతున్న 10 దేశాలలో సంపన్న సౌదీ అరేబియాతో పాటు భారత్ కూడా ఉంది.

ఆనందకర దేశాన్ని గుర్తించటానికి ఐక్యరాజ్యసమితి విభాగం 'సుస్థిర అభివృద్ధి మార్గాల వ్యవస్థ' ఇటీవల విడుదల చేసిన నివేదికలో భారత్ స్థానం గత ఏడాది కంటే తగ్గింది. 156 దేశాల మధ్య భారత్ 118వ స్థానంలో నిలిచింది. డెన్మార్క్, స్విట్జర్లాండ్, ఐస్‌లాండ్, నార్వే, ఫిన్లాండ్ వరసగా మొదటిస్థానాల్లో నిలిచాయి. తలసరి జీడీపీ, జీవితకాలపు అంచనా, సామాజిక మద్దతు, అవకాశాలను ఎంచుకునే స్వేచ్ఛ వంటి అంశాలను సంతోష సూచికలుగా ఈ నివేదికలో పరిగణలోకి తీసుకున్నారు. ■

## 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు లాకులెత్తిన కేంద్రం

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) వల్ల దేశంలో వ్యవసాయం సహా పలురంగాల్లో మౌలిక వసతులు పెరుగుతాయని, అప్పుల కన్నా ఇది మేలని తొలి నుంచీ సమర్థించిన లోక్‌సత్తా.. ఎఫ్‌డీఐలను వ్యతిరేకిస్తున్న బీజేపీ, తెదేపా తదితర పార్టీలది నాటకాలేనని 2011లోనే స్పష్టంచేసింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తప్ప అధికారంలోకి వస్తే ఏ పార్టీ వీటిని వ్యతిరేకించదు అన్న లోక్‌సత్తా మాటల్ని నిజం చేస్తూ యూపీయే హయాంలో ఎఫ్‌డీఐలను వ్యతిరేకించిన బీజేపీ ఇప్పుడు మాట మార్చి దూకుడును ప్రదర్శించింది. ఎఫ్‌డీఐలను అనుమతించే విషయంలో కొన్ని కీలక నిర్ణయాలు వేగంగా తీసుకొంది. దీని ప్రకారం రక్షణ, ఔషధ, పౌర విమానయానం, ఆహార ప్రాసెసింగ్ రంగాల్లోకి నూరుశాతం విదేశీ పెట్టుబడులు లభించే అవకాశం ఏర్పడుతోంది. రక్షణ, ఔషధ రంగాల్లో విదేశీ పెట్టుబడులకు సంబంధించి ఇప్పుడున్న నిబంధనలను సరళీకృతం చేశారు. సింగిల్ బ్రాండ్ రిటైల్ వర్తక నిబంధనల్లోనూ మార్పులు ప్రతిపాదించారు. ■




# వ్యవసాయ సంక్షోభం @ టమాటాలు- 2016 దృశ్యం

పంట రేట్లు పెరిగినప్పుడు ఎగుమతుల మీద ఆంక్షలు విధించి, రేట్లు పడిపోయినప్పుడు వ్యవసాయ సంక్షోభాన్ని మాత్రం పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర పాలకుల, రాజకీయ నేతల పాపాల్ని ఎండగడుతున్న లోక్‌సత్తా వాదనల్ని 2016లో తెలంగాణ రాష్ట్రంలో నిరూపిస్తున్న చిత్రాలివి.

ఈ ఏడాది టమాటా బాగా పండి తమ కష్టాలు తీరతాయని రైతులు ఎంతో ఆశపడ్డారు. దీంతో కరీంనగర్ జిల్లా రామడుగు, తిమ్మాపూర్ మండలాలకు చెందిన రైతులు జిల్లా కేంద్రంలోని మార్కెట్‌కు భారీగా తీసుకొచ్చారు. కానీ కిలోకు 50పైసలే విదులుస్తామన్నారు. సరకును వెనక్కి తీసుకెళ్లలేక రవాణా ఖర్చులకు భయపడి స్థానికంగా ఉన్న చెత్తకుండీలో పారబోశారు. 2016 మార్చిలో జరిగిన ఈ ఘటన ఒక చిత్రం. ఆరోజు ఏ ప్రభుత్వ నేతా టమాటా రైతుల్ని పట్టించుకోలేదు, వారి ఆదాయాన్ని పెంచటం కోసం మాట్లాడలేదు.

ఇక రెండో చిత్రం 2016 జూన్‌లోది. టమాటా కేజీ రూ.80-100 వెచ్చించి వినియోగదారులు కొంటున్న దృశ్యం. టమోటా రేట్లు పెరిగి గొంతున్నవాళ్లు గగ్గోలు పెట్టటంతో ప్రభుత్వం ఆదరాబాదరగా టమాటాల స్వేచ్ఛా వాణిజ్యంపై ఆంక్షలు విధించింది.





ఇది కేవలం తెలంగాణకో, టమాటాలకో, 2016కో పరిమితం కాదు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఉల్లి దగ్గర్నుంచీ దాదాపు ప్రతి పంటకూ ప్రతి ఏటా రైతు ఇదే దుస్థితిని ఎదుర్కొంటున్నాడు. ప్రకృతి శాపం వల్లకాకుండా పాలకుల పాపం వల్లే దేశంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పక్షపాత, మోసపూరిత విధానాలతో ప్రపంచంలో వ్యవసాయ దిగ్గజంగా ఎదిగే భారత్ అవకాశాన్ని చేజేతులారా చెడగొడుతున్నది పాలకులే. రైతుల్ని తిండిగింజలు, పరిశ్రమలకు ముడిసరకులు ఉత్పత్తిచేసే రోబోలుగా కాకుండా తమలాగా ఎదగాలనుకుంటున్న సాటి మనుషులుగా గుర్తించి ధరల ఒడిదుడుకులను తట్టుకునే నిర్దిష్ట వ్యవసాయ విధానాన్ని రూపొందించి అమలుచేస్తేనే ఈ దుస్థితి మారటం మొదలవుతుంది. స్వేచ్ఛా వాణిజ్యంతో రైతులకు ఆదాయం, వినియోగదారులకు చౌక ధర-రెంటినీ సమన్వయం చేయటం పూర్తిగా ఆచరణసాధ్యం.

## చెరకుకూ దెబ్బ

అంతర్జాతీయ ధరలు పెరుగుతుండటంతో చక్కెర ఎగుమతులు పెరిగి లాభాలస్తాయని ఆశపడుతున్న తరుణంలో ఎగుమతుల్ని నీరుగార్చడం కోసం ప్రభుత్వం 20శాతం ఎక్స్‌పోర్ట్ సుంకం విధించింది. దేశీయంగా నిల్వలను పెంచేందుకు ఈ సుంకం విధించామని చెబుతున్న సర్కారీ వర్గాలు రైతులకు ఆదాయం పెరగటంపై మాత్రం దాటవేస్తున్నాయి. ■

# లోక్‌సత్తా 2.0 - ఉధృతంగా మలిదశ ఉద్యమ సదస్సులు




ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మలిదశ (లోక్‌సత్తా 2.0) ఉద్యమ సదస్సులు ఉధృతంగా జరుగుతున్నాయి. ఈ సదస్సులకు జిల్లా కన్వీనర్లు అధ్యక్షత వహిస్తుండగా రెండు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, విద్యార్థులు, యువత పెద్దఎత్తున ఈ సదస్సుల్లో పాల్గొంటున్నారు. పాలన సంస్కరణల కోసం గత ఇరవై ఏళ్లుగా లోక్‌సత్తా సాగించిన ఉద్యమాలను సమీక్షించుకుని- మారుతున్న పరిస్థితులకనుగుణంగా మలిదశ ఉద్యమాన్ని నిర్దిష్ట ఎజెండాతో నిర్మించాలని ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. మలిదశ ఉద్యమంలో మరింత కీలకంగా పనిచేయాలని, లోక్‌సత్తా ఎజెండాను విస్తృతంగా అన్ని వర్గాల్లోకీ తీసుకెళ్లాలని నిర్ణయించారు. అనంతపురం, కడప, కరీంనగర్, వరంగల్, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, గుంటూరు జిల్లాల్లో లోక్‌సత్తా 2.0 ఉద్యమ సదస్సుల అనంతరం జిల్లాల సన్నాహక కమిటీలు నియోజకవర్గాలవారీగా కన్వీనర్లతో ఏర్పాటయ్యాయి. కో కన్వీనర్ సాతులూరి గోవిందరావు ఈ ఎంపికను పర్యవేక్షిస్తున్నారు. ఆయా నియోజకవర్గాలవారీ కన్వీనర్లు జులై 15 నాటికి తమ నియోజకవర్గాలలో మలిదశ ఉద్యమ సదస్సులను నిర్వహించి, నియోజకవర్గాలవారీ కమిటీలను నియమిస్తారు. ఈ తేదీనాటికి రెండు తెలుగు రాష్ట్రాలలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో సంస్థాగత నిర్మాణం పూర్తి చేసుకుంటామని, ఆగస్టులో లోక్‌సత్తా ఇరవై ఏళ్ల ఉద్యమ వార్షికోత్సవ సభను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నామని రామ్మోహనరావు తెలిపారు. లోక్‌సత్తా భావజాలం అజరామరమని, ప్రజాచైతన్యం, ప్రజాస్వామ్య సంస్కరణలకు లోక్‌సత్తా ఉద్యమ సంస్థ అనివార్యమని అన్నారు. ■

## జీవో 28ని ఖండించిన సదస్సులు, సహకార సంస్థల స్వయంప్రతిపతికి డిమాండ్

పౌరుల స్వేచ్ఛకు, రాజ్యాంగ హక్కులకు ప్రతీకయిన మ్యాక్స్ (పరస్పర సహాయ సహకార సంఘాల) చట్టం, 1995 పరిధిలోని పాల డెయిరీలను ప్రభుత్వ పెత్తనమున్న పాత 1964 పరిధిలోకి తెస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 28ని సదస్సుల్లో లోక్‌సత్తా నేతలు ఖండించారు. 1995లో ఉన్నతాధికారిగా ఉన్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చొరవతో మ్యాక్స్ చట్టం ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిందని, ఆ చట్టం వల్ల వచ్చిన సహకార డెయిరీలు లాభాల బాటలో నడుస్తూ రైతులకు ఆదాయాన్నిస్తుండటంతో పలు రాష్ట్రాలు అదే తరహా చట్టాన్ని తెచ్చాయని అన్నారు.

ప్రభుత్వ డెయిరీలు మాత్రం నష్టాల బాట పట్టాయన్నారు. జాతీయ సలహా మండలిలో సభ్యునిగా ఉన్న అవకాశాన్ని వినియోగించుకుని సహకార సంస్థల స్వతంత్ర ప్రతిపత్తికి గ్యారంటీనిచ్చే 97వ రాజ్యాంగ సవరణను జేపీ సాధించారన్నారు. సహకార సంస్థల్లో అవినీతి, నేర ధోరణులు ఉంటే తప్ప ప్రభుత్వం జోక్యం ఉండకూడదని, ప్రభుత్వం ప్రజల హక్కులను గౌరవించకపోతే పౌరసమాజంగా పోరాడతామన్నారు. ■

## కోదండరాంపై దాడి దారుణం

తెలంగాణ ఉద్యమం రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలనూ చేరటంలో ఐకాస నేత కోదండరాంది కీలకపాత్రని, ఆయనపై విమర్శలు దారుణమని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అన్నారు. రాష్ట్రాన్ని తమ అడ్డాగా తెరాస భావిస్తోందని, అందుకే కేవలం పాలనను విమర్శించినందుకు తెరాస మంత్రులు, నాయకులు మూకుమ్మడి దాడికి దిగారని అన్నారు. ఎలాంటి తెలంగాణ ఏర్పడాలన్న చర్చను ఉద్యమ సమయంలో జరపాలన్న లోక్‌సత్తా ప్రజాస్వామిక సూచనను కోదండరాం సహా ఎవరూ పట్టించుకోలేదని, దాని దుష్పరిణామాలలో ప్రస్తుత ఆధిపత్య రాజకీయ సంస్కృతి కూడా ఒకటని అన్నారు. అధికారమే లక్ష్యంగా పనిచేస్తున్నందున తెరాస ఫిరాయింపుల్ని ఎడాపెడా ప్రోత్సహించి తన ఉద్యమ స్వరూపాన్ని కోల్పోయిందన్నారు.

## పార్టీ ఆధ్వర్యంలో సహ సేవా కేంద్రం

సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకునేవారికి సహాయసహకారాలు అందించేందుకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్టు పాండురంగారావు తెలిపారు. సహ చట్టంపై ఎంతో అవగాహన కలిగిన గంజి శ్రీనివాసరావు ప్రతి గురువారం లోక్‌సత్తా కార్యాలయంలో పౌరులకు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జిల్లాకు ప్రభుత్వ వైద్యశాల రావాల్సిందే

విజయనగరం జిల్లాకు ప్రభుత్వ వైద్యకళాశాల మంజూరు చేయటం సాధ్యం కాదని, నిధుల కొరత ఉందని రాష్ట్ర వైద్యఆరోగ్య మంత్రి కామినేని శ్రీనివాస్ చెప్పటం సిగ్గుమాలిన రాజకీయమని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ ధ్వజమెత్తారు. విజయనగరంలోని అమాయక గిరిజన, బడుగుబలహీన వర్గాలు అనారోగ్యంతో అల్లాడుతుంటే మంత్రికి మాత్రం పట్టటం లేదన్నారు. ఇక్కడ ప్రాథమిక స్థాయి నుంచి ఆరోగ్య రంగాన్ని బాగుచేసేందుకు, ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుకు లోక్‌సత్తా రెండేళ్లుగా పోరాడుతోందన్నారు. ప్రయివేటు వైద్యకళాశాలలకు అనుమతిని తాము వ్యతిరేకించటం లేదని, కానీ ప్రభుత్వ రంగంలో కళాశాల తప్పనిసరని అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత వంటి పద్ధతుల ద్వారా రూ.300 కోట్లు సమీకరించడం ప్రభుత్వానికి పెద్ద పని కాదని, కానీ ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పం లేకపోవటమే సమస్యగా ఉందని అన్నారు. ప్రజలకు సరైన విద్య, వైద్యం అందించేందుకు చొరవ చూపకపోతే ఇక ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు ఎందుకు అని బాబ్జీ ప్రశ్నించారు.

## దీనస్థితిలో సంక్షేమ వసతి గృహాలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంక్షేమ వసతి గృహాలు అత్యంత దీనస్థితిలో ఉన్నాయని భీశెట్టి బాబ్జీ ఆవేదన వ్యక్తం చేశారు. బడులు తెరిచే లోపు వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల్ని కల్పించాలన్న ఇంగితం కూడా పాలకులకు లేదన్నారు. పార్టీ నాయకులతో కలిసి విజయనగరం జిల్లాలోని పలు సంక్షేమ హాస్టళ్లను ఆయన సందర్శించారు. మురుగునీరు వసతి గృహాల్లోకి వచ్చి మంచినీటి నుయ్యిలో కలిసిపోయిందని, ఇటువంటివి పునరావృతం కాకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇలాంటి చిన్నచిన్న పనులే సక్రమంగా చేయలేనివాళ్లు ఇక విద్యాప్రమాణాలనేం మెరుగుపరుస్తారని నిలదీశారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. వసతి గృహాలపై లోక్‌సత్తా పరిశీలనలు కొనసాగుతుంటాయని, విద్యార్థులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.





# రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ లోక్‌సత్తా భారీ ధర్నా, కుల రాజకీయాలపై ధ్వజం








రాష్ట్రంలో వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ విభాగం డిమాండ్ చేసింది. ఈ జిల్లాలకు ప్రత్యేక హోదా రాయితీలిస్తేనే రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెంది యువతకు ఉద్యోగాలొస్తాయని పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. లోక్‌సత్తా పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సును విజయనగరం గురజాడ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాబ్జీ మాట్లాడుతూ, రాష్ట్రంలో విడివిడిగా పిలుస్తున్న రాయలసీమలోని నాలుగు జిల్లాలకు, ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు మొత్తం ఏడింటికీ ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా వెనకబడిన దాదాపు 100 జిల్లాలకు ప్రత్యేక హోదా ఇస్తూ అందులో రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణను చేర్చాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ ఇప్పటికే సూచించారని, ఇలా జిల్లా ప్రాతిపదికన ప్రత్యేక హోదాపై ఏ రాష్ట్రానికీ అభ్యంతరం ఉండాల్సిన పన్లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ నిర్ణయాన్ని అమలుచేయవచ్చని స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయం, పాలన కులం చుట్టూ తిరుగుతోందని, కుల రాజకీయాల్ని, నియంతృత్వ పాలనను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో జూట్, ఫెర్రో అల్లాయిస్ తదితర పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడితే ఈ ప్రాంత కేంద్ర, రాష్ట్ర మంత్రులు అశోక్‌గజపతిరాజు, అచ్చెన్నాయుడు, మృణాళిని కనీసం పట్టించుకోకపోవటం దారుణమన్నారు. నిరుద్యోగులను, పొరుగు ఉద్యోగులను, రైతులను, మహిళలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తెదేపా తర్వాత మాట మార్చి జనాన్ని దగా చేస్తోందన్నారు. ప్రజాసమస్యలపై లోక్‌సత్తా నాయకులు స్పష్టమైన పరిష్కారాలతో పోరాటాన్ని కొనసాగించాలన్నారు.

సమావేశంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ, లోక్‌సత్తా ప్రజల్లోకి మరింత విస్తృతంగా వెళ్లాలని, ప్రజాసమస్యలపై మంత్రులను, ఎమ్మెల్యేలను ఎండగట్టాలని సూచించారు. జిల్లా యూనిట్‌గా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రత్యేక హోదాకు డిమాండ్ చేయటం మంచి పరిణామమని, ఇది తక్షణం ఆచరణాత్మకమైనదని అన్నారు. ప్రత్యేక హోదాపై తెలుగుదేశం, బీజేపీల నాటకాల్ని నిరసిస్తూ, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా నేతలు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పంచాది రాంబాబు, ఎంఎస్ఎన్ మూర్తి, ఆవుల గోవర్ధన్, మౌళి, ప్రసాద్, పాపారావు, సుధాకర్, శివరామారావు, పక్కి శంకర్, దామోదర్, ప్రసాద్, శ్రీదేవి, కృష్ణారావు జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ■




గ్రామీణ కర్ణాటకలో రక్షిత తాగునీటి (ఆర్‌వో) ప్లాంట్ల నిర్మాణంలో 2011నాటి బీజేపీ హయాంలో మొదలైన కుంభకోణాన్ని, సిద్ధరామయ్య నేతృత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని, గ్రామీణాభివృద్ధి మంత్రి పాటిల్ చేత రాజీనామా చేయించి రూ.500 కోట్ల ఆర్‌వో ప్లాంట్ల స్కాంపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న లోక్‌సత్తా పార్టీ కర్ణాటక విభాగం

Posting Date 07-07-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on July 1st 2016






## 'మార్పు కోసం' ముందుకొచ్చిన విద్యార్థులు, యువతనుద్దేశించి ఢిల్లీలో జేపీ ప్రసంగాలు





మార్పు కోసం పరిజ్ఞానంతో, నిబద్ధతతో పనిచేస్తామని ముందుకొచ్చిన భారతీయ విద్యార్థులు, యువతనుద్దేశించి ఇటీవల న్యూఢిల్లీలో లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రసంగించారు. విజన్ ఇండియా ఫౌండేషన్ (విఐఎఫ్), అశోకా విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా దిశానిర్దేశం చేశారు. ఐఐటీలు, ఐఐఎంలు వంటి అత్యుత్తమ విద్యాసంస్థల నుంచి వస్తున్న మెరికల్లాంటి యువతను ఆధునిక భారత నిర్మాణోద్యమంలో భాగస్వాముల్ని చేసేందుకు విజన్ ఇండియా ఫౌండేషన్ నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో 'స్థానిక ప్రభుత్వాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయటం' పై జేపీ ప్రసంగించారు. ఇందులో విద్యార్థులతో పాటు వివిధ వృత్తులు, వ్యాపారాల్లో ఉన్న యువ పట్టభద్రులు కూడా పాల్గొన్నారు. దేశంలోని ఐఐటీల పూర్వ విద్యార్థులు, ఆధ్యాపకులు విజన్ ఇండియా ఫౌండేషన్‌ను ప్రారంభించారు. తర్వాత ఇందులో దేశంలోని పేరొందిన విద్యాసంస్థలతోపాటు విదేశాల్లోని ప్రముఖ సంస్థలు కూడా భాగస్వాములయ్యాయి. వీఐఎఫ్ సమావేశం అనంతరం అశోకా యూనివర్సిటీ క్యాంపస్‌లో 'యంగ్ ఇండియా ఫెలోషిప్' (వైఐఎఫ్) విద్యార్థులనుద్దేశించి 'ఇటీవలి ఎన్నికల ఫలితాలు-ప్రత్యామ్నాయ రాజకీయాలు' అంశంపై జేపీ మాట్లాడారు. ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.

**Book-Post**
PRINTED MATTER

To

If not delivered please return to:

**Lok Satta Times**
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad